ప్రతి అక్షరం - ప్రజల కోసం

# రోమింగ్ న్యూస్

తెలుగు దినపత్రిక

యాదాద్రి భువనగిరి

పేజీలు : 8
సంపుటి : 3
సంచిక : 238

సోమవారం 3 మార్చి 2025 | చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్ | HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD

## న్యూజిలాండ్‌పై టీం ఇండియా గెలుపు



# గుట్ట బ్రహ్మోత్సవాల్లో ముక్కోటి దేవతలకు ఆహ్వానం


రెండో రోజుకు వైభవంగా ధ్వజారోహణం

నేటి నుంచి అలంకారాలకు శ్రీకారం

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం ధ్వజారోహణం, అగ్నిప్రతిష్ట, భేరిపూజ, దేవతాహ్వానం, హవనం వంటి ఉత్సవాలను ఆలయ అర్చకులు వైభవోపేతంగా నిర్వహించారు. మొదట ఉదయం ఆలయ ప్రధానార్చకులు నల్లంతిఘల్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యుల అర్చకత్వంలో అర్చకులు, వేదపండితులు, యజ్ఞాచార్యులు కిరాణా చార్యులు ప్రత్యేక పూజలతో యజ్ఞశాలలో హెూమం నిర్వహించారు. అనంతరం ముక్కోటి దేవతలను ఆహ్వానించే ధ్వజారోహణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అంతకుముందు స్వామివారిని ప్రత్యేక అలంకారంలో ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. పాంచరాత్ర ఆగమ శాస్త్రం ప్రకారం ఉదయం నిర్వహించిన ధ్వజారోహణ ఉత్సవంతో గరుత్మంతుడి ద్వారా నరసింహుడి కల్యాణానికి ఆహ్వానం అందుకుని భువికి దిగివచ్చిన ముక్కోటి దేవతలకు.. సాయంత్రం నిర్వహించిన భేరిపూజ, దేవతాహ్వానం ద్వారా స్వాగతం పలికే కైంకర్యాన్ని నయనానందకరంగా నిర్వహించారు.



## సోమనాథ్ ఆలయంలో ప్రధాని మోదీ పూజలు



గిర్ సోమనాథ్: ప్రధాని నరేంద్ర మోదీ గుజరాత్‌లోని గిర్ సోమనాథ్ జిల్లాలోని సోమనాథ్ ఆలయాన్ని దర్శించుకున్నారు. గుజరాత్ పర్యటనలో భాగంగా ఆదివారం సోమనాథ్ దివ్యక్షేత్రాన్ని సందర్శించి.. ప్రత్యేక పూజలు చేశారు. తొలుత జామ్‌నగర్ జిల్లాలోని జంతు సంరక్షణ, పునరావాస కేంద్రమైన వన్‌తారాను సందర్శించిన మోదీ.. ఆ తర్వాత 12 జ్యోతిర్లింగాల్లో మొదటి జ్యోతిర్లింగమైన సోమనాథుడి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు ఆచరించారు.

మిగతా 2 లో



## దేశాన్ని మార్చే శక్తి యువతకే ఉంది

- ఓటమి నుంచే అద్భుతమైన ఆవిష్కరణలు
- ఐఐటీ-హెచ్‌లో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్



# పదేళ్లు ఎస్ఎల్‌బీసీని పక్కన పెట్టిన బీఆర్ఎస్

బిల్లులు చెల్లించలేదు.. విద్యుత్ నిలిపివేశారు

కాళేశ్వరం, దేవాదులలో ప్రమాదాలు జరిగితే నాటి పెద్దలు వెళ్లలేదు

- ఎట్టి పరిస్థితుల్లోనూ ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును పూర్తి చేస్తాం
- ఎస్ఎల్‌బీసీ సొరంగాన్ని పరిశీలించిన సీఎం రేవంత్‌రెడ్డి
- సొరంగ ప్రమాదంపై మరో 2,3 రోజుల వరకు ఏమీ చెప్పలేం
- బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని వెల్లడి

**మహబూబ్‌నగర్, రోమింగ్ న్యూస్:** శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగం (ఎస్ఎల్‌బీసీ) కూలిన ఘటన పై అధికార, ప్రతిపక్షాలు ఐక్యంగా నిలవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రమాదంలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపడుతోందని, రెండు మూడు రోజుల వరకు ఏ విషయం అధికారికంగా చెప్పలేమని స్పష్టం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం దోమలపెంట సమీపంలో ప్రమాదం చోటు చేసుకున్న ఎస్ఎల్‌బీసీ సొరంగాన్ని సీఎం ఆదివారం సాయంత్రం పరిశీలించారు. మంత్రు లు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, బాలూ నాయక్‌లతో కలిసి సొరంగంలోకి వెళ్లి సహాయ చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భం గా అధికారులు, జాతీయ, రాష్ట్ర సంస్థలతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ముఖ్యమంత్రి విలేకరులతో మాట్లాడారు. “ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును 2005-06లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం అధునాతన సాంకేతికతతో

మిగతా 2 లో



## కేసీఆర్ సంతకం యమపాశమైంది

- కృష్ణా జలాల్లో 511 టీఎంసీలు ఏపీకి ఇచ్చింది ఆయనే
- రాష్ట్ర ప్రజలపై కిషన్‌రెడ్డి పగబట్టారు
- వనపర్తిని అభివృద్ధి పథంలో నిలిపే బాధ్యత నాది
- ప్రజాపాలన-ప్రగతిబాట సభలో సీఎం రేవంత్‌రెడ్డి

02

# రెండున్నరేళ్లలో మామునూరు ఎయిర్ పోర్టు పూర్తి

- యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలు
- ప్రధాని మోదీ చొరవతోనే వరంగల్‌కు విమానాశ్రయం
- ఏవియేషన్ హబ్‌గా తెలంగాణ
- కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, కిషన్‌రెడ్డి




**హైదరాబాద్,రోమింగ్ న్యూస్:** తెలంగాణను ఏవియేషన్ హబ్‌గా చేయాలన్న ఆలోచన ఉందని.. తద్వారా ఏరోస్పేస్ తయారీ రంగంలో యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలు లభిస్తాయని పౌరవిమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ‘ప్రస్తుతం విదేశాల్లో విమానాలు తయారవుతున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ విమానాల తయారీ రంగాన్ని దేశానికి తీసుకురావాలని గట్టిగా కృషి చేస్తున్నారు. ఈ రంగాన్ని హైదరాబాద్‌కు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నాం. ప్రధాని జోక్యం చేసుకోవడంతోనే వరంగల్‌కు విమానాశ్రయం వచ్చింది.

మిగతా 2 లో

# రక్తంతో మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ చిత్రపటం

## భువనగిరిలో ఘనంగా డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ జన్మదిన వేడుకలు

భువనగిరి, రోమింగ్ న్యూస్: భువనగిరి మాజీ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ పై ఓ యువకుడు వినూత్నంగా తన అభిమానాన్ని...ప్రేమను చాటుకున్నాడు. డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ జన్మదిన వేడుకల సందర్భంగా తన రక్తపు చుక్కలతో నర్సన్న చిత్రపటాన్ని గీసి అభిమానం తెలియజేశాడు. నకిరేకల్ నియోజకవర్గ కట్టంగూర్ మండల్ పరడ గ్రామానికి చెందిన కొండ శివ గౌడ్ బీ.వై.ఎన్.ఎస్ నాయకులు ఈ వినూత్న పద్ధతిలో తన రక్తాన్ని బూర నర్సయ్య గౌడ్ చిత్రపటానికి సరిపోయేంతగా ఇచ్చి బూర పై తనకు గల అభిమానాన్ని ప్రేమను చాటుకున్నాడు. ప్రాణ మున్నంత వరకు బూర నర్సయ్య గౌడ్ వెంట నడుస్తాని శివ గౌడ్ ఈ సందర్భంగా రోమింగ్ న్యూస్ తో మాట్లాడుతూ వివరించారు. భువనగిరి పార్లమెంటు పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచి భారీ ఎత్తున ఆయన అభిమానులు జన్మదిన వేడుకలను విజయవంతం చేయడానికి తరలివచ్చారు. వేలాదిమంది క్యాడర్ కోలాహలంలో ఆయన కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ప్రారంభించారు. ఉదయం నుంచి రాత్రి వరకు జన్మదిన వేడుకలు జరగడం విశేషం.



ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
3 మార్చి
2025







## సోమనాథ్ ఆలయంలో ప్రధాని మోదీ పూజలు

(మొదటిపేజీ తరువాయి)

అనంతరం పొరుగున ఉన్న జునాగఢ్ జిల్లాలోని గిర్ వన్యప్రాణుల అభయారణ్యం హెడ్‌క్వార్టర్స్ సాసన్‌కు బయల్దేరి వెళ్లారు. ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళా కోట్లాది మంది దేశ ప్రజల భాగస్వామ్యంతో ముగిసినట్లు ప్రధాని 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఒక సేవకుడిగా.. మహా కుంభోత్సవం తర్వాత సోమనాథ్ ఆలయానికి వస్తానని అనుకున్నానని.. ఇందులో భాగంగానే సోమనాథుడిని దర్శించుకొని తన సంకల్పాన్ని నెరవేర్చుకున్నట్లు తెలిపారు. దేశంలోని ప్రతి ఒక్కరి ఆరోగ్యం, శ్రేయస్సును ఆకాంక్షించినట్లు పేర్కొన్నారు.

## ప్రమాద స్థలానికి కాకుండా.. ఎన్నికల ప్రచారానికి వెళ్లింది మీరే

- వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికే నాపై సీఎం విమర్శలు: హరీశ్‌రావు
- ఎస్‌ఎల్‌బీసీ ఘటనపై సిటింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్

**హైదరాబాద్:** ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో ప్రమాదం జరిగితే.. అక్కడికి వెళ్లకుండా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో నిమగ్నమైన సీఎం రేవంత్‌రెడ్డి తనపై విమర్శలు చేయడం హాస్యాస్పదమని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. వనపర్తి వేదికగా ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలపై ఆదివారం హరీశ్‌రావు ఒక ప్రకటనలో స్పందించారు. రేవంత్‌రెడ్డి తన వైఫల్యం నుంచి దృష్టి మళ్లించడం కోసమే హరీశ్‌రావు విహార యాత్రకు అబుదాబీ వెళ్లినట్లు ఆరోపిస్తున్నారంటూ దుయ్యబట్టారు. తన సన్నిహిత మిత్రుడు, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి కుమార్తె పెళ్లివేడుకకు అబుదాబీ వెళ్లే దాన్ని వివాదం చేయడానికి సీఎం ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. "ప్రభుత్వం నడుపుతున్నది సీఎం. ప్రమాదస్థలానికి తక్షణమే వెళ్లాల్సింది ఆయనే. కానీ, ఆయన కర్తవ్యం మరచి నాపై బురదజల్లేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రతిపక్ష నేతల కదలికలను తెలుసుకోవడానికి నిఘా పెడుతున్నారంటే ఆయనలో అభద్రతాభావం ఉన్నట్లే" అని హరీశ్‌రావు పేర్కొన్నారు. హడావుడి పనులతోనే..: రాజకీయ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ పాలకులు సాంకేతికపరమైన అంశాలను పక్కనపెట్టి హడావుడిగా ఎస్‌ఎల్‌బీసీ పనులను పరిగెత్తించారని, కార్మికులు వద్దంటున్నా వినకుండా వారిని మృత్యుకూపంలోకి నెట్టారని హరీశ్ ఆరోపించారు. నిజాయతీ ఉంటే ఎస్‌ఎల్‌బీసీ ప్రమాదంపై సిటింగ్ జడ్జితో విచారణ జరిపించి దోషులెవరో తేల్చాలని సీఎంను డిమాండ్ చేశారు. "సీఎం ఎక్కడికి పోయినా కేసీఆర్‌ను తిట్టడం తప్ప.. ప్రజలకు పనికొచ్చే విషయం ఒక్కటి కూడా మాట్లాడడం లేదు. రేవంత్‌కు, కాంగ్రెస్‌కు ప్రాజెక్టుల గురించి మాట్లాడే హక్కు లేదు. కాంగ్రెస్ హయాంలో నత్తనడక నడిచిన పనులను పరిగెత్తించి పూర్తి చేసింది భారాస ప్రభుత్వమే. పదేళ్ల కాలంలో ఒక్క ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే 12 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాం. 2014-23 మధ్య కాలంలో భారాస ప్రభుత్వం ఎస్‌ఎల్‌బీసీ సొరంగాన్ని 11.48 కి.మీ. తవ్విన విషయాన్ని ఎందుకు దాచిపెడుతున్నారు? ఏపీ సీఎం చంద్రబాబు రోజుకు 10 వేల క్యూసెక్కుల నీటిని తరలించుకుపోతున్నారు. ఇదేంటని మేం ప్రశ్నిస్తే.. రేవంత్ మా మీద విరుచుకుపడుతున్నారు. మీకు చేతనైతే.. కృష్ణా నీటి విషయంలో చంద్రబాబుపై యుద్ధం ప్రకటించండి. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడండి" అని హరీశ్ పేర్కొన్నారు.

## యాదగిరి క్షేత్రంలో ధ్వజారోహణం

**యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట పంచనారసింహుల దివ్యాలయంలో ఆదివారం ఉదయం ధ్వజారోహణం, రాత్రి దేవతాహ్వానం వేడుకలతో వార్షిక బ్రహ్మోత్సవాల్లో ప్రచార ఘట్టం ఆవిష్కృతమైంది. లోకకల్యాణార్థం ఏటేటా నిర్వహించే ఉత్సవాల విశిష్టతను విశ్వమంతా చాటేందుకు గరుడ ఆళ్వారుడిని రప్పించి పూజలు, ఇష్ట పదార్థాలను నైవేద్యంగా సమర్పించే కైంకర్యాలను చేపట్టారు. స్వామివారి తిరు కల్యాణానికి దేవతలకు పిలుపునిచ్చే బాధ్యతను గరుడు ఆళ్వారుడికి పూజారులు ఆరాధనల ద్వారా అప్పగించారు. రాత్రి భేరి పూజలో అష్టారాగాలను ఆలపిస్తూ సకల దేవతలను స్వాగతిస్తూ విడిది ఏర్పాట్లు చేశారు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో స్వామివారు బంగారు వాహనాలపై విహరించనున్నారు. హైదరాబాద్‌కు చెందిన సాయి పావని కన్‌స్ట్రక్షన్ ఇండియా లిమిటెడ్ యజమాని గార్లపాటి సుభాష్ తన తల్లిదండ్రుల పేరిట రూ.24 లక్షల వ్యయంతో తయారు చేయించిన స్వర్ణ కవచ శేష, గరుడ వాహనాలను ఆదివారం సమర్పించారు. వీటితోపాటు బర్మా టేక్‌తో స్వామివారి సేవా పీఠాన్ని సుమారు రూ.4 లక్షల వ్యయంతో తయారు చేయించి దేవస్థానానికి అందజేశారు. బ్రహ్మోత్సవాల్లో నూతన సేవా పీఠం, బంగారు వాహనాలతో ఊరేగింపు నిర్వహిస్తామని ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

## 'మహాలక్ష్మి'కి రూ.5,500 కోట్లు కేటాయించాలి

- 1,500 కొత్త బస్సులకు రూ.600 కోట్లు అవసరం
- బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించాలని సర్కారుకు ఆర్టీసీ వినతి

**హైదరాబాద్:** రానున్న రాష్ట్ర బడ్జెట్‌లో ఆర్టీసీకి భారీ ఎత్తున నిధులు కేటాయించాలని ప్రభుత్వానికి ఆ సంస్థ విజ్ఞప్తి చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన రెండో రోజు నుంచి మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం అందించే 'మహాలక్ష్మి' పథకాన్ని ఆర్టీసీ అమలు చేస్తోంది. రద్దీ ఎక్కువైన నేపథ్యంలో ప్రయాణికులకు ఉపశమనం కలిగించేందుకు, డిమాండ్ ఉన్న రూట్లలో నడిపేందుకు కనీసం 1,500 కొత్త బస్సులు కొనుగోలు చేయాలన్నది ఆర్టీసీ లక్ష్యం. ఇదే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. విద్యార్థులకు రాయితీ బస్‌పాస్‌లు, కొత్త బస్సుల కొనుగోలుకు అవసరమయ్యే నిధులను రాష్ట్ర ప్రభుత్వమే బడ్జెట్‌లో కేటాయించాలని ఆర్టీసీ యాజమాన్యం కోరింది.

### మొత్తంగా రూ.8,110 కోట్లు..

బడ్జెట్‌లో కేటాయించాలంటూ ఆర్టీసీ ఇచ్చిన మొత్తం ప్రతిపాదనల విలువ రూ.8,110 కోట్ల వరకు ఉంటుందని తెలుస్తోంది. అదేవిధంగా గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీకి సుమారు రూ.1,200 కోట్లు రావాల్సి ఉందని, ఆ డబ్బును బడ్జెట్‌లో కేటాయించాలని విజ్ఞప్తి చేసింది. ఉపముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కను కొద్దిరోజుల క్రితం కలిసి ఆర్టీసీ ఉన్నతాధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో ఇటీవల సమావేశమై బడ్జెట్ కేటాయింపుల విషయంలో ఆర్థిక మంత్రితో మాట్లాడాలని కోరినట్లు సమాచారం. 'మహాలక్ష్మి' పథకం కింద అందిస్తున్న ప్రయాణాల విలువ నెలకు రూ.455 కోట్లకుపైనే అని.. ఈ లెక్కన 2025-26 బడ్జెట్‌లో రూ.5,500 కోట్లు కేటాయించాలని కోరినట్లు తెలుస్తోంది. 1,500 కొత్త బస్సుల కొనుగోలుకు ఒక్కోదానికి రూ.40 లక్షల చొప్పున రూ.600 కోట్లు కావాలని అడిగారు. విద్యార్థుల బస్‌పాస్, రీయింబర్స్‌మెంట్లకు రూ.430 కోట్లు, ఎలక్ట్రిక్ బస్సుల మౌలిక సదుపాయాల కల్పనకు రూ.540 కోట్లు, బస్‌డిపోలు, బస్టాండ్‌ల అభివృద్ధికి రూ.40 కోట్లు అందించాలని కోరారు. కార్మికులకు సంబంధించి సీసీఎస్, పీఎఫ్ డబ్బుల్ని ఆర్టీసీ యాజమాన్యం సంస్థ అవసరాలకు వాడేసింది. ఈ మొత్తాన్ని సర్దుబాటు చేయడం యాజమాన్యానికి తలకు మించిన భారంగా ఉంది. వన్‌టైం సెటిల్మెంట్ కింద ఆర్టీసీకి రూ.1,000 కోట్లు ఇవ్వాలని కోరినట్లు సమాచారం. ఆర్టీసీకి 2024-25 బడ్జెట్‌లో రూ.4,084 కోట్లు కేటాయించగా ఫిబ్రవరి రెండో వారం వరకు రూ.2,900 కోట్లు వచ్చాయి. మార్చి 31కి ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో మిగిలిన రూ.1,184 కోట్లు రాబట్టాలని ఉన్నతాధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.

# పదేళ్లు ఎస్‌ఎల్‌బీసీని పక్కన పెట్టిన బీఆర్‌ఎస్

(మొదటిపేజీ తరువాయి)



టీబీఎం (టన్నెల్ బోరింగ్ మెషిన్) ద్వారా ప్రారంభించింది. దీని తవ్వకం తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావంలోపే 30 కిలోమీటర్ల మేర పూర్తయింది. రాష్ట్రం ఏర్పాటయ్యాక ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేస్తారని మేం విశ్వసించాం. కానీ, నాటి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. నిర్మాణ సంస్థకు బిల్లులు చెల్లించకపోగా.. విద్యుత్ సరఫరా నిలిపివేసింది. దీంతో పదేళ్ల పాటు పనులు నిలిచిపోయాయి. మా ప్రభుత్వం వచ్చిన వెంటనే ఈ ప్రాజెక్టుపై దృష్టి పెట్టింది. సంస్థలకు బిల్లులు చెల్లించి, నిపుణులతో చర్చించాం. అమెరికా నుంచి టీబీఎం, ఇతర పరికరాలను రప్పించాం. పనులు వేగంగా పూర్తిచేసి నల్గొండ నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని మేం చిత్తశుద్ధితో పనిచేస్తుంటే అనుకోకుండా ఈ దుర్ఘటన జరిగింది. బాధితులకు ప్రభుత్వం, ప్రతిపక్షం అంతా అండగా నిలిచి ఆదుకోవాలి.

### దుర్ఘటన జరిగిన గంటలోపే మంత్రులు

గత నెల 22న ప్రమాదం జరిగిన గంటలోపే మంత్రులు ఉత్తమ్, జూపల్లి ఇక్కడికి చేరుకున్నారు. ప్రభుత్వ వ్యవస్థ అంతా ఇక్కడే ఉండి పనిచేస్తోంది. ప్రతి రెండు మూడు గంటలకు నేను వివరాలు తెలుసుకుంటూనే ఉన్నాను. నిరంతరం ఆర్మీ, మరో 11 సంస్థలు పనిచేస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, ప్రైవేటు ఏజెన్సీలు కూడా పాల్గొంటున్నాయి. గల్లంతైన వారి వివరాలు ఇప్పటికీ తెలియరాలేదు. అవిశ్రాంతంగా సహాయ చర్యల్లో పాల్గొంటున్న సంస్థలను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. దేశ ప్రధాని నుంచి మొదలు ప్రతిఒక్కరూ వారి సలహాలు, సూచనలు అందించారు. ప్రమాదం జరిగినా.. మేం మనోధైర్యం కోల్పోలేదు. పట్టుదలతో ప్రాజెక్టు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం. సొరంగంలో ఊట వస్తోందని నిపుణులు చెబుతున్నారు. 13.50 కిలోమీటర్ల దూరంలో పనిచేస్తుండటం క్లిష్టంగా మారింది. సోమవారం సాయంత్రానికి కన్వేయర్ బెల్ట్ మరమ్మతు చేసి మట్టిని బయటకు పంపేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మట్టి కింద మనుషులు, యంత్రాలు ఎక్కడ ఉన్నాయనే నిపుణులు ఒక అంచనాకు రాలేకపోతున్నారు.

### మేం ఎవరినీ నిందించడం లేదు

సొరంగం పైకప్పు కూలిన ఘటనపై కొందరు రాజకీయ ఆరోపణలు చేస్తున్నారు. బురద చల్లే పనిచేస్తున్నారు. కానీ, మేం ఎవరినీ నిందించడం లేదు. మా లోపం ఎక్కడైనా ఉందా? భారాస పరిపాలనలో శ్రీశైలం జల విద్యుత్ కేంద్రంలో అగ్ని ప్రమాదం జరిగితే ఎవరినీ అక్కడికి వెళ్లనివ్వలేదు. నేను పీసీసీ అధ్యక్షుడిగా శ్రీశైలం వెళ్లేందుకు ప్రయత్నిస్తే అరెస్టు చేసి జైల్లో పెట్టారు. కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టుల్లో మరణాలు సంభవిస్తే నాడు విపక్షాలను రానీయలేదు. ప్రభుత్వ పెద్దలు మాత్రం అక్కడికి వెళ్లనేలేదు. మేం మాత్రం ప్రతిపక్షాలు సొరంగం పరిశీలనకు వస్తే అనుమతించాం. మేం పారదర్శకంగా ఉన్నా మమ్మల్ని తప్పు పట్టాలని చూస్తున్నారు.

### ప్రతిపక్ష నాయకుడు ఎక్కడ?

ఇంత పెద్ద ప్రమాదం జరిగితే రాష్ట్రంలో ప్రతిపక్ష నాయకుడు కె.చంద్రశేఖర్‌రావు ఎక్కడున్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఏ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. నేను ఎన్నికల ప్రచారానికి వెళ్లానని విమర్శించిన హరీశ్‌రావు.. సొరంగంలో ప్రమాదం జరిగినప్పుడు దుబాయ్‌లో దావత్ చేసుకోలేదా. కాదంటే పాస్‌పోర్ట్ వివరాలు బయట పెట్టమనండి. లేదంటే నేను బయటపెడతా. దేవాదుల ప్రమాదంలో చిక్కుకున్న వారి మృతదేహాలు ఐదేళ్ల వరకు దొరకలేదు. ఈ విషయాన్ని ప్రతిపక్షం మర్చిపోతే ఎలా? శ్రీశైలం జలవిద్యుత్ కేంద్రంలో ప్రమాదం జరిగితే మరమ్మతులు చేయనేలేదు. మానవ తప్పిదంతో నాడు ప్రమాదం జరిగింది. ఎస్‌ఎల్‌బీసీ ప్రమాదం ప్రకృతి విపత్తు.. బాధిత కుటుంబాలను ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటుంది.

### రోబోల వినియోగానికి ఆదేశం

సొరంగంలో సహాయక చర్యలకు రోబోలను వినియోగించాలని యంత్రాంగాన్ని ఆదేశించాం. ప్రపంచంలో ఎక్కడ ఏరకమైన పరికరాలు, నిపుణులున్నా రప్పించేందుకు ప్రయత్నిస్తున్నాం. ఇప్పటికే ఎన్జీఆర్ఐ పలుచోట్ల కొన్నింటి ఉనికిని ప్రాథమికంగా గుర్తించింది. ఆ ప్రాంతాలకు ర్యాట్ హోల్ మైనర్స్ వెళ్లారు. కానీ, అక్కడ మనుషుల ఉనికి బయటపడలేదు" అని సీఎం పేర్కొన్నారు.

# కేసీఆర్ సంతకం యమపాశమైంది

- కృష్ణా జలాల్లో 511 టీఎంసీలు ఏపీకి ఇచ్చింది ఆయనే
- రాష్ట్ర ప్రజలపై కిషన్‌రెడ్డి పగబట్టారు
- వనపర్తిని అభివృద్ధి పథంలో నిలిపే బాధ్యత నాది
- ప్రజాపాలన-ప్రగతిబాట సభలో సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్ :** కృష్ణా జలాల్లోని 811 టీఎంసీల్లో 511 టీఎంసీలు ఏపీకి తీసుకెళ్లవచ్చంటూ.. నాడు కేసీఆర్ పెట్టిన సంతకం తెలంగాణ రైతుల పాలిట యమపాశమైందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. రాయలసీమకు నీటిని తరలించడానికి కేసీఆర్ కారణం కాదా అని ప్రశ్నించారు. నాడు పోతిరెడ్డిపాడు సామర్థ్యం పెంచి వై.ఎస్. సీమకు నీరు తీసుకెళితే.. తరువాత ఆయన కుమారుడు జగన్ ఏపీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నాటి తెలంగాణ సీఎం కేసీఆర్ ప్రగతిభవన్‌కు పిలిచి పంచభక్ష్య పరమాన్నాలు పెట్టి రాయలసీమ ఎత్తిపోతలకు పునాదులు వేయలేదా అని రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. కేసీఆర్ పాలమూరు ద్రోహి అని దుయ్యబట్టారు. రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసే ఇందిరమ్మ మహిళా శక్తి తదితర పథకాలను ఆదివారం వనపర్తిలో సీఎం రేవంత్ ప్రారంభించారు. వివిధ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు హాజరైన ఆయన స్థానిక పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ప్రారంభించారు. రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ ద్వారా 50 మంది ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీ వర్గాల మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన 'ప్రజాపాలన-ప్రగతి బాట' సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడారు. "కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవితలు నన్ను.. సీఎం పదవి నుంచి దిగుతావా లేదా అని అడుగుతున్నారు. మా పాలమూరుకు మీరు నీళ్లు తెచ్చారా? పదేళ్లుగా మీరు ప్రాజెక్టులు కడితే ఇక్కడి నుంచి వలసలు ఎందుకు ఆగలేదు? భాక్రానంగల్ నుంచి నాగార్జునసాగర్ వరకూ, శ్రీశైలం నుంచి శ్రీరాంసాగర్ వరకూ మా చెమటతో కట్టాం. మీరు నిర్మించిన ప్రాజెక్టు ఏదైనా ఉందా..? ఆర్డీఎస్ ప్రాజెక్టు ఎందుకు ఎండిపోయింది? ఎస్‌ఎల్‌బీసీ గతంలో కాంగ్రెస్ సర్కారు మొదలుపెట్టి 32 కిలోమీటర్ల తవ్వకం పూర్తిచేస్తే.. మిగిలిన పనులు భారాస పాలనలో నిలిపివేశారు. ఆ కారణంగానే నేడు టన్నెల్ కుప్పకూలి.. 8 మంది గల్లంతయ్యారు. ఈ పాపం కేసీఆర్‌ది కాదా? భారాస పాలనలో బడి పిల్లల యూనిఫాంలు కుట్టే పనుల్ని పెద్ద కంపెనీలకు ఇచ్చి కమీషన్లు తీసుకున్నారు. ఇప్పుడు పాఠశాలలు, హాస్టళ్లలో 1.30 కోట్ల జతల దుస్తులు కుట్టించి ఇచ్చే వ్యాపారం మహిళలకు ఇచ్చాం. 4.50 లక్షల ఇళ్లు పేద ఆడబిడ్డల పేరుమీద ఇస్తున్నాం. గత పదేళ్ల భారాస పాలనలో స్వయంసహాయక సంఘాలు నిర్వీర్యమయ్యాయి. మేం వాటికి రూ.వేల కోట్లు అందించి అభివృద్ధిపథంలో నడిపిస్తున్నాం. గత పదేళ్లు కేసీఆర్ ఆయన ఇంట్లో వాళ్లకి మాత్రమే ఉద్యోగాలిచ్చారు. మేం 55 వేల కొలువులిచ్చాం.

### అభివృద్ధికి కిషన్‌రెడ్డి అడ్డం పడుతున్నారు

తెలంగాణకు నువ్వేం చేశావని నన్ను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అడుగుతున్నారు. వరంగల్‌లో ఎయిర్‌పోర్టు నేను కష్టపడి తెస్తే.. తానే తెచ్చానని ఆయన అంటున్నారు. మెట్రో విస్తరణ, మూసీకి నిధులు రాలేదంటే.. ఆపింది ఆయనే కదా.. ఆయన కడుపు నిండా అసూయ, కుళ్లు పెట్టుకుని కాళ్లలో కట్టె పెట్టే పనులు చేస్తున్నారు. కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ హైదరాబాద్‌కు వచ్చి అభివృద్ధి పనులపై సమీక్షిస్తే ఈ ప్రాంత ఎంపీ అయిన కిషన్‌రెడ్డి ఎందుకు డుమ్మా కొట్టారు? మెట్రోను మేడ్చల్ వరకూ పొడిగించాలని ఆ సమావేశంలో ఈటల అడిగింది నిజం కాదా? కర్ణాటకలో ప్రతిపక్షంలో ఉన్న భాజపా నేత శోభ మెట్రో విస్తరణకు అనుమతి తీసుకువెళ్లారు. చెన్నై మెట్రోకు నిర్మలా సీతారామన్ అనుమతిచ్చారు. కానీ హైదరాబాద్ మెట్రో విస్తరణకు కిషన్‌రెడ్డి అడ్డుపడుతున్నారు. తెలంగాణ అభివృద్ధికి సహకరించాలని ఆయన ఇంటికి వెళ్లి మరీ అడిగాను. తెలంగాణకు ఏదీ రాకపోవడానికి సమస్య మోదీ కాదు. రాష్ట్రానికి ఏమైనా ఇవ్వాలని ప్రధానికి ఉంది. కానీ కిషన్‌రెడ్డి ఎందుకు అడ్డుపడుతున్నారో తెలియడంలేదు.




## దేశాన్ని మార్చే శక్తి యువతకే ఉంది

(మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులను ఉద్దేశించి ఉపరాష్ట్రపతి ప్రసంగించారు. సృజనాత్మక ఆవిష్కరణలే భారత్ పెట్టుబడి అని.. శాస్త్ర, సాంకేతిక రంగాలే దేశాన్ని శాసిస్తున్నాయని స్పష్టంచేశారు. పస్తుతం భాషల విషయంలో జరుగుతున్న ఘర్షణలు బాధాకరమని వ్యాఖ్యానించారు. "చంద్రయాన్ 2, 3 ప్రయోగాల సమయంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొని విజయవంతం చేశాం. ఓటమి నుంచే అద్భుతమైన ఆవిష్కరణలు పుట్టుకొస్తాయి. అవే విజయానికి పునాదిగా మారతాయి. సృజనాత్మక ఆవిష్కరణలపై విద్యార్థులు దృష్టిపెట్టాలి" అని సూచించారు. ఆలోచనలు, ఆవిష్కరణల్లో ఐఐటీ హైదరాబాద్ అగ్రగామిగా నిలిచిందని ఉపరాష్ట్రపతి ప్రశంసించారు. కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎంపీ రఘునందన్‌రావు, మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి, ఐఐటీ-హెచ్ ఛైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి, డైరెక్టర్ ప్రొ.బీఎస్‌మూర్తి పాల్గొన్నారు. ఉపరాష్ట్రపతి సతీమణి సుదేశ్ ధన్‌ఖడ్ 'ఏక్ పేడ్ మా కే నామ్' పేరుతో మొక్క నాటారు. తొలుత దిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ దంపతులకు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో కందిలోని ఐఐటీ హైదరాబాద్‌కు చేరుకున్న ఉపరాష్ట్రపతి దంపతులు.. అక్కడి కార్యక్రమం అనంతరం శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని ఓ ఫంక్షన్ హాలులో వివాహ వేడుకకు హాజరయ్యారు. రాత్రి 7 గంటలకు ప్రత్యేక విమానంలో దిల్లీకి తిరుగు పయనమయ్యారు.

## 450 మంది రైతులను పొట్టనపెట్టుకున్న కాంగ్రెస్

(మొదటిపేజీ తరువాయి)

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం దేవునిగుట్టతండాలో సాగునీరు అందక ఎండిన వరిపొలాలను ఆదివారం సాయంత్రం ఆయన పరిశీలించారు. నీరులేక ఇబ్బందులు పడుతున్నామంటూ విలపించిన గిరిజన మహిళా రైతులను కేటీఆర్ ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ అంటే కాళేశ్వరం అని, కాంగ్రెస్ కరువు తీసుకొచ్చిందని రాష్ట్ర రైతులు చర్చించుకుంటున్నారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి కేసీఆర్‌పై ఉన్న ద్వేషం, కోపం, పగే దీనికి కారణమని దుయ్యబట్టారు. "మేడిగడ్డ బ్యారేజీలో నెర్రెను కాంగ్రెస్ పాలకులు అతిపెద్ద ప్రమాదంగా చూపుతున్నారు. కాళేశ్వరం స్టేజ్ 2 కింద తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ వరకు పంటలు చేతి కందకుండా పోయే దుస్థితి నెలకొంది. మధ్యమానేరులో ప్రస్తుతం ఉన్న 15 టీఎంసీల నీటినుంచి ఒక టీఎంసీని మల్కపేట రిజర్వాయరుకు విడుదల చేయాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు.



## అక్కా.. నీ చేతి వంట తినక చాలా కాలమైంది

- పార్వతమ్మతో సీఎం రేవంత్‌రెడ్డి
- చదువుకునే రోజుల్లో వనపర్తిలో అద్దెకు ఉన్న ఇల్లు సందర్శన

**వనపర్తి :** 'అక్కా బాగున్నావా.. నీ చేతి వంట తినక చాలా కాలమైంది' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి వనపర్తిలో విద్యాభ్యాసం చేస్తున్నప్పుడు నివాసమున్న ఇంటి యజమానురాలు పార్వతమ్మను ఆప్యాయంగా పలకరించారు. ఆదివారం వనపర్తిలో పర్యటన సందర్భంగా సీఎం.. తాను చదువుకునే రోజుల్లో అద్దెకు ఉన్న పార్వతమ్మ ఇంటికి స్థానిక శ్రీవేంకటేశ్వర ఆలయం వెనుక దారి నుంచి కాలినడకన చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమె కుటుంబసభ్యులు మంగళహారతులతో స్వాగతం పలికారు. అనంతరం సీఎం వారితో పాతజ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. పార్వతమ్మ పూరీ, కీమా అందించడంతో ఇష్టంగా తిన్నారు. చదువుకునే రోజుల్లో తిరిగిన వీధుల్లో నడవడం, నివసించిన ఇంటిని సందర్శించడం ఆనందం కలిగించిందని చెప్పారు. తమ్ముడు రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో తన ఇంటికి రావడం ఎంతో సంతోషాన్ని కలిగించిందని పార్వతమ్మ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. అనంతరం చిన్నారెడ్డి నివాసానికి సీఎంతోపాటు మంత్రి జూపల్లి వెళ్లారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి వాహనంలోనే కూర్చున్నారు. ఈ విషయాన్ని సీఎం గుర్తించి పిలుచుకురమ్మని సెక్యూరిటీ సిబ్బందికి సూచించారు. వారు వెళ్లి ఆయన్ను తీసుకొచ్చేలోగా రేవంత్‌రెడ్డి బయటికి రాగా అందరూ అక్కడి నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం చిన్ననాటి మిత్రులు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. 'ఏం రా.. సూరీ బాగున్నావా? రవి, రఘు, వంశీ, రాము అందరూ బాగున్నారా?' అంటూ రేవంత్‌రెడ్డి మిత్రులను ఆత్మీయంగా పలకరించారు. ఉన్నత పాఠశాలలో చదువుచెప్పిన గురువులు జగన్మోహన్, సోమసుందర్, విజయకుమార్‌లకు నమస్కరించి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. అప్పటికే ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు తదితరులు క్యాంపు కార్యాలయంలో ఉండటంతో వారిని పలకరించి తిరిగి మిత్రుల వద్దకు వెళ్లారు. స్నేహితులతో కలిసి భోజనం చేశారు. చిన్నప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం ఇంటర్మీడియట్ అధ్యాపకులను సీఎం పలకరించారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
3 మార్చి
2025





# గుట్టలో వైభవంగా ధ్వజారోహణం

**రెండో రోజుకు చేరిన యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాలు**

**భేరిపూజ, దేవతాహ్వానం.. నేడు అలంకారాలకు శ్రీకారం**

**తొలి రోజు మత్స్యావతారం... శేషవాహన సేవ**

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్:

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం ధ్వజారోహణం, అగ్నిప్రతిష్ఠ, భేరిపూజ, దేవతాహ్వానం, హవనం వంటి ఉత్సవాలను ఆలయ అర్చకులు వైభవోపేతంగా నిర్వహించారు. మొదట ఉదయం ఆలయ ప్రధానార్చకులు నల్లంతిఘల్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యుల అర్చకత్వంలో అర్చకులు, వేదపండితులు, యజ్ఞాచార్యులు కిరాణా చార్యులు ప్రత్యేక పూజలతో యజ్ఞశాలలో హోమం నిర్వహించారు.

**అనంతరం ముక్కోటి దేవతలను ఆహ్వానించే**

ధ్వజారోహణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అంతకుముందు స్వామివారిని ప్రత్యేక అలంకారంలో ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. పాంచరాత్ర ఆగమ శాస్త్రం ప్రకారం ఉదయం నిర్వహించిన ధ్వజారోహణ ఉత్సవంతో గరుత్మంతుడి ద్వారా నరసింహుడి కల్యాణానికి ఆహ్వానం అందుకుని భువికి దిగివచ్చిన ముక్కోటి దేవతలకు.. సాయంత్రం నిర్వహించిన భేరిపూజ, దేవతాహ్వానం ద్వారా స్వాగతం పలికే కైంకర్యాన్ని నయనానందకరంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనువంశిక ధర్మకర్త బీ. నర్సింహమూర్తి, ఈవో ఏపూరీ భాస్కర్ రావు, డిప్యూటీ ఈవో దోర్బల భాస్కర్ శర్మ, ఏఈవోలు గజవెల్లి రఘు, నవీన్, సూపరింటెండెంట్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

**వైభవంగా ధ్వజారోహణం**

బ్రహ్మోత్సవాల్లో ముఖ్య ఘట్టమైన ధ్వజారోహణ మహోత్సవాన్ని ఉదయం అర్చకులు వైభవోపేతంగా జరిపించారు. సామూహిక దీక్షాపరులైన వేదపారాయణికులచే చతుర్వేద పారాయణాలు, మూలమంత్ర, మూర్తిమంత్ర జపాల నడుమ ధ్వజారోహణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ధ్వజారోహణ ఉత్సవంలో భాగంగా గరుడాళ్వారుల ప్రతిమను తెల్లని వస్త్రంపై చిత్రించి, ప్రధానాలయ ముఖ మంటపంలో గర్భాలయానికి అభిముఖంగా ఉన్న బంగారు ధ్వజస్తంభానికి అలంకరించారు. అనంతరం గరుడ ముద్దలను గాలిలోకి ఎగురవేస్తూ నరసింహుడి కల్యాణానికి గరుత్మంతుడి ద్వారా ముక్కోటి దేవతలకు ఆహ్వానాన్ని పంపే ఉత్సవాన్ని నేత్రపర్వంగా జరిపించారు.

**ఘనంగా భేరిపూజ, దేవతాహ్వానం, హవనం**

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం ధ్వజారోహణం ద్వారా నరసింహుడి కల్యాణానికి ముక్కోటి దేవతలను ఆహ్వానం పంపే ఘట్టాన్ని జరిపిన అర్చకులు.. సాయంత్రం ఆలయంలో భేరిపూజ, దేవతాహ్వానం ద్వారా.. బ్రహ్మోత్సవాలను వీక్షించడానికి వచ్చిన సకల దేవతలకు స్వాగతం పలికే కైంకర్యాన్ని వేడుకగా నిర్వహించారు. కల్యాణ ఆహ్వానాన్ని మన్నించి లక్ష్మీసమేత నారసింహుల కల్యాణాన్ని కనులారా వీక్షించి దీవించడానికి భువికి దిగివచ్చిన సకల దేవతలకు భేరిపూజ, దేవతాహ్వానం ద్వారా స్వాగతం పలికే ఘట్టాలను ఆలయ అర్చకులు కనుల పండువగా జరిపారు. రాగతాళ వాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ భేరితాడనం శబ్దాల హోరుతో బ్రహ్మాది దేవతలకు అఖండ స్వాగతం పలికే తంతును బ్రహ్మాండంగా ఆవిష్కరించారు. నారసింహుడి కల్యాణాన్ని వీక్షించడానికి వచ్చిన సకల దేవతలను పంచసూక్త పఠనాలతో హవిస్సులు అందజేసి సంతృప్తిపర్చే 'హవనం' కైంకర్యాన్ని అర్చకులు వేదోక్తంగా నిర్వహించారు.

**నేడు మత్స్యావతారం, శేషవాహన సేవ**

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో మూడో రోజైన సోమవారం మత్స్యావతార అలంకార సేవ, శేషవాహన సేవ నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు స్వామివారిని మత్స్యావతారంలో అలంకరించి ఊరేగించనున్నారు.రాత్రి 8.30 గంటలకు శేషవాహనంపై స్వామివారు ప్రధానాలయ మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చే ఉత్సవాలను ఘనంగా జరపనున్నారు.



గుట్ట బ్రహ్మోత్సవాలలో ఆదివారం రాత్రి బేరి పూజ నిర్వహిస్తున్న అర్చకులు



గుట్ట బ్రహ్మోత్సవాలలో ఆదివారం ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు...



శ్రీలక్ష్మీనరసింహ వైభవం గురించి ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తున్న పద్మశ్రీ డాక్టర్ గరికపాటి నరసింహారావు.



బ్రహ్మోత్సవాలలో హవనం నిర్వహిస్తున్న అర్చకులు



ముక్కోటి దేవతలను ఆహ్వానించే ధ్వజారోహణంలో గరుడ ముద్దలను ఎగురవేస్తున్న ఉప ప్రధానార్చకులు బట్టర్ సురేంద్ర చార్యులు.





విద్యుత్ దీపాల వెలుగులో గుట్టకు వెలుగుల జిలుగులు



బ్రహ్మోత్సవాలలో రెండవ రోజు విశేష పుష్పాలంకరణలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారు.



ధ్వజారోహణం సందర్భంగా నిర్వహించిన సేవలో పాల్గొన్న ఈవో భాస్కరరావు, డిప్యూటీ ఈవో భాస్కర శర్మ, ఆలయ అర్చకులు

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక

సోమవారం
3 మార్చి
2025





# పదేళ్లు పాలించి ప్రజా సమస్యలను పరిష్కరించ లేకపోయిన సన్యాసి కేసిఆర్






**ప్రజల్లోకి టిఆర్ఎస్ నేతలు వస్తే నిలదీయండి**

**కేటీఆర్, హరీష్ సంస్కారహీనంగా మాట్లాడుతున్నారు**

**మార్చి 31 లోగా రైతు భరోసా జమ పూర్తి చేస్తాం**

**ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి లోగా స్వయం ఉపాధి పథకాలకు 6,000 కోట్లు**


**తెలంగాణ రైజింగ్ ను కెసిఆర్ కుటుంబం అడ్డుకోలేదు**

**వనపర్తి సభలో డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క**

**వనపర్తి, రోమింగ్ న్యూస్:** పదేళ్లపాటు రాష్ట్రాన్ని పాలించిన కెసిఆర్ ప్రజా సమస్యలను పరిష్కరించలేని సన్యాసి అని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మండిపడ్డారు. వనపర్తి లో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన అనంతరం జరిగిన సభను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. గడిని దాటి బయటికి రాలేని కెసిఆర్ తో పాటు కేటీఆర్, హరీష్ లు తమ ప్రభుత్వంతో పాటు ముఖ్యమంత్రిని, మంత్రులను పాలన చేతకాని సన్నాసులు అంటూ వ్యాఖ్యలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. పదేళ్లపాటు రాష్ట్రాన్ని దోచుకున్న వాళ్లు ప్రజా ప్రభుత్వాన్ని విమర్శించటం మానుకోవాలని హెచ్చరించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలను చేపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న బి ఆర్ఎస్ నేతలను గ్రామాలకు వస్తే ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అనేక సంక్షేమ పథకాలు ఆనాడు మీ పాలనలో ఎందుకు చేయలేదని బి ఆర్ఎస్ నాయకులను ప్రశ్నించాలని ప్రజలను కోరారు. దేశం మొత్తం తెలంగాణ వైపు చూసేలా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనను సాగిస్తుందని అన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా అభివృద్ధి పనులు చేపట్టిందని తెలిపారు. గడి నుంచి ఏనాడు బయటికి రాని పెద్దమనిషి తో పాటు కేటీఆర్ హరీష్ లు సభ్యత సంస్కారం లేకుండా మాట్లాడడం బాధాకరమన్నారు. పదేళ్లపాటు దోచుకోవడానికి అలవాటు పడిన బిఆర్ఎస్ నేతలు, తాము అభివృద్ధి చేస్తుంటే జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. పదేళ్లు పాలించిన మీరు దళితులకు మూడు ఎకరాలు ఎందుకు ఇవ్వలేకపోయారు, లక్ష రూపాయల రుణమాఫీ ఎందుకు చేయలేకపోయారని ప్రశ్నించారు.

**మార్చి 31 లోగా రైతు భరోసా జమ....**

గత బిఆర్ఎస్ పాలకులు రైతు బంధు పేరిట మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. అప్పటి ప్రభుత్వం ఒక సీజన్లో రైతుబంధు ఎగవేసిన తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత 7,660 కోట్ల రైతుబంధును జమ చేసిందన్నారు. అప్పటి ప్రభుత్వం సీజన్ కు ఎకరాకు 5,000 ఇస్తే తమ ప్రభుత్వం ఎకరాకు 6,000 చొప్పున సంవత్సరానికి రెండు పంటలకు అదనంగా 2,000 కలిపి 12,000 చెల్లిస్తుంది అని తెలిపారు. ఇప్పటికే రెండో విడత రైతు భరోసాను ప్రారంభించామని 9,660 కోట్ల రైతు భరోసా నిధులను మార్చి 31 లోగా జమ చేస్తామని తెలిపారు. దళిత కు మూడు ఎకరాల భూమి ఇస్తామన్న ఆ సన్యాసి మాట తప్పడమే కాకుండా దళితులను మోసం చేశారన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం కోసంఆరోగ్యశ్రీని 5 లక్షల నుంచి 10 లక్షలకు పెంచడం జరిగిందనిఅన్నారు. గృహ జ్యోతి కింద గ్యాస్ సిలిండర్ రూ .5,00 లకె ఇస్తున్నామని ఇందుకు సంబంధించి పౌరసరఫరాల శాఖకు 4,440 కోట్లను ఇప్పటికే చెల్లించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే కరెంటు కోతలు ఉంటాయని బి ఆర్ఎస్ నేతలు వ్యాఖ్యలు చేశారని, గత 15 సంవత్సరాలలో ఎప్పుడూ లేనివిధంగా ప్రస్తుతం 16 వేల మెగావాట్ల డిమాండ్ ఉన్నప్పటికీ రెప్పపాటు కూడా కరెంటు సరఫరాలో ఒక్క క్షణం ట్రిప్ కాకుండా నాణ్యమైన విద్యుత్ ని ఇస్తున్నామన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్ కోసం 14,870 కోట్ల ను డిస్కంకు రైతుల పక్షాన ప్రభుత్వం డబ్బులు చెల్లించిందన్నారు. పేద మధ్యతరగతి ప్రజల




కోసం 200 యూనిట్లను ఉచితంగా ఇస్తున్నామని, ఇందుకుగాను ప్రభుత్వం డిస్కంకు 1,689 కోట్లను చెల్లించిందన్నారు. రైతులు వేసిన పంటలు పకృతి వైపరీత్యాలతో దెబ్బతింటే రైతులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఇన్సూరెన్స్ రైతుల తరఫున 1,514 కోట్లు కట్టామన్నారు. సన్న రకాలకు 500 రూపాయలు బోనస్ చొప్పున చెల్లిస్తున్నామని, ఇందుకు గాను 1,804 కోట్లు రైతులకు చెల్లించామన్నారు. గత 10 ఏళ్ల బి ఆర్ఎస్ పాలనలో రెసిడెన్షియల్ స్కూల్ లకు కాస్మెటిక్స్ డైట్ చార్జీలను ఒక్క రూపాయి ఇవ్వలేదని, తమ ప్రభుత్వం పెద్ద మనసుతో 40 శాతం పెంచిందన్నారు. ఆనాటి ప్రభుత్వంలో ఉన్న సన్నాసులు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. రెసిడెన్షియల్ స్కూల్ కు సంబంధించి ఏ ఒక్క భవనం నిర్మించలేదని, తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా 60 ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేసి ఒక్కొక్క స్కూల్కు రూ. 2,00 కోట్లను మంజూరు చేసి నిర్మించడం జరుగుతుందని, ఇది తమ ప్రభుత్వ నిబద్ధత అని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం నిత్యం 18 గంటల పాటు పనిచేసి సంపాదించిన ప్రతి పైసాను ప్రజల సంక్షేమం కోసం అభివృద్ధి కోసం ఖర్చు చేస్తుందన్నారు

**వనపర్తి నుంచే కొత్త పథకం ప్రారంభం....**

వనపర్తి నియోజకవర్గం అత్యంత రాజకీయ చైతన్యవంతమైన ప్రాంతమని, ఈ ప్రాంతం నుంచి రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకాన్ని ప్రారంభిస్తుందన్నారు. గత ప్రభుత్వం పదేళ్లపాటు పాలన చేసి ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ కార్పొరేషన్లకు ఒక్క రూపాయి నిధులు కేటాయించలేదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో అప్పటి ఇందిరమ్మ ప్రభుత్వాలు అన్ని వర్గాల సంక్షేమం కోసం పని చేసిందని, కార్పొరేషన్లకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించేది అని గుర్తు చేశారు. దురదృష్టవశాత్తు కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో మాత్రం నాటి ప్రభుత్వం కార్పొరేషన్ లకు ఒక్క రూపాయి ఇవ్వలేదని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ అమలు తర్వాత తమ కాంగ్రెస్ ప్రభుత్వం కార్పొరేషన్లకు 6,000 కోట్ల రూపాయలను కేటాయించిందన్నారు. సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ గ్రూపులకు ఏప్రిల్ 14న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకల లోగా 6,000 కోట్లను పంపిణీ చేస్తామని తెలిపారు. వనపర్తి నియోజకవర్గం అభివృద్ధి సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 2,200 జరిగిందన్నారు.విద్యార్థి దశ నుంచి ఇక్కడి ప్రజల కష్ట సుఖాలు తెలుసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేల కోట్లతో అభివృద్ధి పనులను చేపట్టారు అన్నారు. సమాజంలో అత్యంత వెనుకబడిన దళితులు మైనార్టీ బీసీల గురించి నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం ఆలోచించ లేదన్నారు. గత ప్రభుత్వం 8 లక్షల కోట్ల భారం వేసినప్పటికిని, తమ ప్రభుత్వం ఏమాత్రం అధైర్య పడకుండా కార్యక్రమాలను కొనసాగిస్తుందని, తమ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు లిఖించదగిందన్నారు రైతులకు రెండు లక్షల లోపు రుణమాఫీ చేయడం జరిగిందని, ఇందుకుగాను 22,000 కోట్లను మూడు నెలల్లో వేసిన చరిత్ర తమ ప్రభుత్వాన్ని అన్నారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ల పేరిట ప్రజలను మోసం చేసిందని , తమ ప్రభుత్వం ఒక్కో నియోజకవర్గానికి 7 వేలఇళ్లను మంజూరు చేసి, మొదటి విడతలో ఒక్కో నియోజకవర్గంలో 3,500 ఇండ్లను నిర్మించడం కోసం ఒక్కో ఇంటికి 5 లక్షల రూపాయలు మంజూరు చేసామన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం దావూస్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 1,80,000 కోట్ల అగ్రిమెంట్లను చేసుకుని వచ్చారని గుర్తు చేశారు. తెలంగాణ అభివృద్ధిని కేసిఆర్, కేటీఆర్, హరీష్ రావులు ఎన్ని కుట్రలు చేసినా ఏ మాత్రం అడ్డుకోలేరని స్పష్టం చేశారు.

# శ్రీలక్ష్మీనరసింహునికి బంగారు గరుడ, శేష వాహనాలు





యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామికి ఆదివారం దాతలు బంగారు గరుడ, శేష వాహనాలను తయారు చేపించి ఆలయానికి సమర్పించారు. హైదరాబాద్ కు చెందిన సాయిపావని కంస్ట్రక్షన్స్ కంపెనీ రూ.12 లక్షల వ్యయంతో బంగారు తాపడంతో గరుడ వాహనాన్ని తయారు చేపించి ఆలయానికి సమర్పించారు. అదేవిధంగా హైదరాబాద్ కు చెందిన గార్లపాటి(సుభాష్) పెద్ద యాదయ్య, రామలింగేశ్వరి దంపతులు మరో రూ.12 లక్షల వ్యయంతో బంగారు శేష వాహనాన్ని తయారు చేపించి దేవస్థానానికి అందజేశారు. అదేవిధంగా హైదరాబాద్ కు చెందిన అనురాధ టింబర్ డిపో యాజమాన్యం.. రూ.4 లక్షల వ్యయంతో బర్మా టేకుతో నారసింహుడికి సేవ పీఠాన్ని తయారు చేపించి ఆలయానికి బహూకరించారు. ఈ స్వర్ణ గరుడ, శేష వాహన సేవలను, స్వామివారి సేవ పీఠాన్ని.. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించే అలంకార సేవల్లో(గరుడ సేవ, శేష వాహన సేవ) వినియోగించనున్నారు. భక్తులు తయారు చేపించిన టేకు పీఠంపై స్వర్ణ గరుడ, శేష వాహన సేవలను అలంకరించి స్వామివారిని ఆలయ మాడవీధుల్లో ఊరేగించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం 3 మార్చి 2025






# ప్రజాసేవకే నా జీవితం అంకితం

## డాక్టర్ బూర నర్సయ్య గౌడ్.. ఘనంగా మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ జన్మదిన వేడుకలు





భువనగిరి, రోమింగ్ న్యూస్: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, అజాతశత్రువు, పేదల సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్న ప్రజా సేవకులు బీసీల ముద్దు బిడ్డ బీజేపీ జాతీయ నాయకులు, భువనగిరి పార్లమెంటు మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ జన్మదిన వేడుకలను భువనగిరి పట్టణంలోని స్థానిక ఏకే ప్యాలెస్ లో అభిమానులు,అన్ని పార్టీలు నాయకులు కార్యకర్తల మధ్యన ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ సమక్షంలో కేక్ కట్ చేసి శాలువాలు కప్పి జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు. ముందుగా వేద బ్రాహ్మణులచే ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నా చివరి శ్వాస వరకు ప్రజాసేవకే జీవితం అంకితమని సమాజంలోని ఆర్థిక అసమానతలు లేని సమాజం నిర్మాణ కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. పదవులు ఉన్న లేకున్నా ప్రజల పక్షాన నిలబడి సమస్య పరిష్కారం కోసం పనిచేస్తానని అన్నారు. జన్మదిన వేడుకలకు పార్లమెంట్ నియోజకవర్గం నుండి భారీగా తరలివచ్చి శు భాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లా అధ్యక్షులు అశోక్ గౌడ్ ,సౌడ రమేష్, చల్ల శ్రీలత, జిల్లా మాజీ అధ్యక్షుడు పాశం భాస్కర్, సీనియర్ నాయకులు కాదురి అచ్చయ్య ,ఏలె చంద్రశేఖర్ పడాల శ్రీను తడిసిన మల్లారెడ్డి , శాగా చంద్రశేఖర్ రెడ్డి %ణ%.లక్ష్మినారాయణ, రచ్చ శ్రీనివాస్, వంగాల వెంకన్న గౌడ్, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బూర నర్సయ్య గౌడ్ జన్మదిన వేడుకల సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతున్న గోపా రాష్ట్ర అధ్యక్షులు బండి సాయన్న గౌడ్, గోపా ఈసీ సభ్యులు







# ఛాతీలో మంట వేధిస్తుందా? అయితే ఇలా చేయండి!

ఏం తిన్నా ఛాతీలో మంట వేధిస్తుంటే దాన్ని అసిడిటీగానే పరిగణించాలి. అయితే ఈ సమస్యను అధిగమించగలిగే యోగాసనాలు ఉన్నాయి. అవేంటంటే....

**మార్జారియాసనం**

వెన్ను, పొత్తికడుపు మీద ప్రభావం చూపించే ఆసనమిది. జీర్ణవ్యవస్థకు రక్తప్రసరణను పెంచి, జీర్ణసంబంధ అవయవాలకు ఈ ఆసనంతో వ్యాయామం దక్కుతుంది. సున్నితమైన మర్దన జరిగి జీర్ణవ్యవస్థ క్రమబద్ధమై, అసిడిటీ నుంచి విముక్తి లభిస్తుంది.

**ఈ ఆసనం ఎలా వేయాలంటే.....**

చేతులు, మోకాళ్ల మీద బల్ల ఆకారంలో నేల మీద కూర్చోవాలి.

ఈ భంగిమలో మోకాళ్లు అరడుగు దూరంలో, చేతులు నిటారుగా నేల మీద ఆనించి ఉంచాలి.

ఊపిరి పీల్చుతూ, తలను నెమ్మదిగా పైకి లేపి వెనక్కి వాల్చాలి.

ఇలా చేస్తూ వీపును పైకి లేపి విల్లు ఆకారంలో వంగాలి.



ఈ భంగిమలో కొన్ని క్షణాలు ఉండి, నెమ్మదిగా వెన్ను వంచుతూ, ఊపిరి వదులుతూ పూర్వ స్థితికి రావాలి.

**అధోముఖశవాసనం**

ఆ ఆసనంలో శరీర బరువు చేతులు, కాళ్లపై పడుతుంది. ఈ ఆసనంతో పొత్తికడుపులోకి ప్రాణవాయువు వెళ్లి అసిడిటీ అదుపులోకి వస్తుంది. ఈ ఆసనం వేయడం కూడా సులువే! దీన్ని ఎలా వేయాలంటే....

చేతులు, కాళ్ల ఆసరాతో శరీరాన్ని బల్ల ఆకారంలో వంచాలి.

ఊపిరి వదులుతూ నడుమును పైకి లేపి, చేతులు, కాళ్లు నిటారుగా ఉంచాలి.

చేతులు, భుజాలకు, కాళ్లు, తుంటికి సమాంతరంగా ఉండాలి. కాలి బొటనవేళ్లు ముందుకు ఉండాలి.

ఇప్పుడు చేతులు నేల మీద బలంగా తాకిస్తూ, తలను వంచాలి. ఈ భంగిమలో చెవులు చేతులను తాకాలి.

ఈ భంగిమలో కొన్ని క్షణాలు ఉండి, మోకాళ్లను వంచి, శరీరాన్ని పూర్వ స్థితికి తీసుకురావాలి.

**బాలాసనం**

ఈ ఆసనం శరీరానికి స్వాంతన కలిగించి, జీర్ణవ్యవస్థకు విశ్రాంతిని అందిస్తుంది. ఫలితంగా అసిడిటీ తగ్గుతుంది. ఈ ఆసనం వేసినప్పుడు జీర్ణసంబంధ అవయవాలకు మర్దన జరిగి, బలపడతాయి. ఈ ఆసనం ఎలా వేయాలంటే....

మెకాళ్ల మీద, రెండు పాదాల బొటనవేళ్లు ఒకదానికొకటి తగిలేలా కాళ్లను వెనక్కి వాల్చి కూర్చోవాలి.

నడుము పైభాగాన్ని ముందుకు వంచి, పడుకోవాలి.

చేతులు రెండూ ముందుకు చాపి, మోకాళ్లకు సమాంతరంగా నేల మీద ఆనించాలి.

భుజాలు రెండూ కిందకు వాల్చాలి.

ఈ భంగిమలో 30 సెకన్లపాటు ఉండి, నెమ్మదిగా పైకి లేవాలి.

# సీనియర్ సిటిజన్ కందుల సోమయ్య పై దాడి

నకిరేకల్ : నకేరికల్ పట్టణం లో పెన్షనర్ల సంఘం కార్యదర్శి కందుల సోమయ్య పైన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ నేతి విద్యసాగర్ పి ఏ గా పని చేసిన పార్థసారథి దాడి చేశాడు. ఈ మేరకు ఆదివారం నకిరేకల్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయ్యింది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు శనివారం ఓ ఫంక్షన్ కు హాజరైన సోమయ్య తో గొడవకు దిగిన పార్థ సారథి లకు మధ్య మాటా మాటా పెరిగి రెచ్చిపోయిన సారథి సోమయ్య పైన చేయి చేసుకున్నాడు. కింద పడేసి కాళ్ళ తో తొక్కాడు. అడ్డొచ్చిన వారిని సైతం పక్కకు నెట్టేసి సోమయ్య చెంప చెళ్లు మనిపించాడు. ఈ సంఘటన పైన ఆదివారం పెన్షన్లు సంఘం నాయకులు తో కలసి పోలీస్ స్టేషను లో ఫిర్యాదు చేశారు. దీంతో పార్థ సారథి పైన కేసు నమోదు చేశారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక







# రెండున్నరేళ్లలో మామునూరు ఎయిర్ పోర్టు పూర్తి

(మొదటిపేజీ తరువాయి)

స్వాతంత్ర్యానికి పూర్వమే ఆసియాలోనే అతిపెద్ద ఎయిర్‌పోర్టుగా వరంగల్‌కు గుర్తింపు ఉంది. విమానాశ్రయం అందుబాటులోకి వస్తే వరంగల్ అన్నిరంగాల్లో మరింత అభివృద్ధి చెందుతుంది. ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. రాష్ట్ర ప్రభుత్వం వీలయినంత త్వరగా భూసేకరణ పూర్తిచేసి, స్థలాన్ని కేంద్రానికి అప్పగిస్తే రెండున్నరేళ్లలో వరంగల్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం పూర్తిచేస్తాం" అని రామ్మోహన్ నాయుడు, కిషన్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల సముదాయం (సీజీవో)లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వీరు మాట్లాడారు. అంతకుముందు వారు 'యోజన కేంద్ర బడ్జెట్ 2025-26' మ్యాగజైన్‌ను ఆవిష్కరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. "వరంగల్‌లో విమానాశ్రయం ఉండాలన్నది ప్రజల చిరకాల కోరిక. 1981 వరకు ఇక్కడ ఉన్న విమానాశ్రయంలో ఏదో రకంగా రాకపోకలు జరిగేవి. హైదరాబాద్‌లోనే అన్ని రంగాలు కేంద్రీకృతం కావడంతో క్రమంగా వరంగల్‌లో డిమాండ్ తగ్గింది. ప్రజల్లో మాత్రం విమానాశ్రయం డిమాండ్ బలంగా ఉంది. 8 నెలల క్రితం నేను మంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పుడు మా నాయకుడు



చంద్రబాబు మార్గదర్శకత్వం చేశారు. మంత్రిగా ఆంధ్రప్రదేశ్‌కు ఎంత చిత్తశుద్ధితో పనిచేస్తారో.. తెలంగాణ అభివృద్ధికీ అదేరీతిలో పనిచేయాలని స్పష్టం చేశారు. మామునూరులో ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ)కి 696 ఎకరాల స్థలం ఉంది. ఇప్పుడున్న స్థలంలో ఉన్న రెండు రన్‌వేలు ఉపయోగించుకోలేని స్థితిలో ఉన్నాయి. రన్‌వే పొడవు 1,800 మీటర్లు ఉంది. ఎయిర్‌బస్ లాంటి విమానాలు నడపాలంటే సుమారు 2,800 మీటర్ల రన్‌వే ఉండాలి. దీనికి అదనంగా భూమి కావాలి. ఎప్పటినుంచో ఏఏఐ రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతోంది. అదనంగా 280 ఎకరాలు సేకరించాలని కేంద్రం నుంచి ప్రయత్నాలు జరిగాయి. శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు 150 కి.మీ. లోపు మరో ఎయిర్‌పోర్టు నిర్మించరాదన్న నిబంధన ఉండేది. దీనికి సవరణ చేస్తూ ఎన్‌వోసీ తీసుకున్నాం. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ భూసేకరణకు ఉత్తర్వులు జారీచేసింది. వరంగల్‌లో విమానాశ్రయం ఏర్పాటుకు కేంద్రం క్లియరెన్స్ ఇచ్చింది. భూసేకరణ ప్రక్రియ పూర్తిచేసి ఏఏఐకి అప్పజెబితే మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా ఎయిర్‌బస్సు విమానాలు నడిపే విధంగా నిర్మిస్తాం. వరంగల్ చరిత్ర, సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించేలా టెర్మినల్ భవనాన్ని ఏర్పాటు చేస్తాం. భద్రాద్రి కొత్తగూడెంలో కూడా చూపిన రెండో స్థలంలో ఏఏఐ ఫీజిబులిటీ పరీక్షలు జరిపింది. తెలంగాణను అన్నిరకాలుగా అభివృద్ధి చేయాలనేది కేంద్రం ఆలోచన. ఒక వారధిలాగా కిషన్‌రెడ్డి పనిచేస్తున్నారు. నేను తెలుగుదేశంలో పార్టీ ఉన్నాను. మాకు జన్మనిచ్చిన స్థానం తెలంగాణ. అలాంటి రాష్ట్రానికి ఎంతో రుణపడి ఉన్నాం. పౌరవిమానయాన మంత్రిగా ఈ ప్రాంతం రుణం తీర్చుకోవడం అదృష్టంగా భావిస్తున్నాను. ఎయిర్‌పోర్టును ఎవరు తీసుకొచ్చారనేది రాజకీయం చేయకుండా ముందుకు వెళ్లాలి" అని రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు.



## అమెరికా అధికారిక భాషగా ఇంగ్లిష్

### ఆర్డర్‌పై ట్రంప్ సంతకం

**వాషింగ్టన్:** అమెరికా అధికారిక భాషగా ఇంగ్లిష్‌ను పేర్కొంటూ డొనాల్డ్ ట్రంప్ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించిన కార్యనిర్వాహక ఆదేశాలపై ఆయన సంతకం చేశారు. తాజా ఆదేశాలు ఫెడరల్ ప్రభుత్వ నిధులతో నడిచే ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలకు తమ సేవలను, పత్రాలను ఇంగ్లిషేతర భాషల్లో కొనసాగించాలా, వద్దా? అని ఎంచుకునే అవకాశాన్ని కల్పిస్తాయి. "ఇంగ్లిష్ అధికారిక భాషగా ఏర్పాటు చేయడం వల్ల సంభాషణలు క్రమబద్ధీకరించడమే కాకుండా ఉమ్మడి జాతీయ ప్రయోజనాలు బలోపేతం అవుతాయి. సమ్మిళిత, సమర్థవంతమైన సమాజాన్ని నిర్మించుకోవచ్చు" అని ఆర్డర్‌లో పేర్కొన్నారు. ఈ పరిణామం దేశంలో ఐక్యతను ప్రోత్సహిస్తుందని.. ప్రభుత్వ కార్యక్రమాల్లో సమర్థతను నెలకొల్పుతుందని వైట్‌హౌస్ వర్గాలు పేర్కొన్నాయి. పౌరుల జీవితాల్లో మార్పు తీసుకొచ్చేందుకు మార్గాన్ని ఏర్పరుస్తుందని అభిప్రాయపడింది. ఇంగ్లిష్‌ను అధికారిక భాషగా గుర్తిస్తూ ఇప్పటికే అమెరికాలోని 30 రాష్ట్రాలు చట్టం చేసినట్లు సమాచారం. అయితే, అమెరికా అధికార భాషగా గుర్తింపు కోసం కాంగ్రెస్ చట్టసభ సభ్యులు దశాబ్దాలుగా ప్రయత్నాలు చేసినప్పటికీ అవి సఫలం కాలేదు. ట్రంప్ రెండోసారి అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన కొన్ని గంటల్లోనే వైట్‌హౌస్ వెబ్‌సైట్ స్పానిష్ వెర్షన్‌ను తొలగించారు. ట్రంప్ తొలిసారి అధ్యక్షుడయ్యాక ఇదే విధంగా చేసినప్పటికీ.. బైడెన్ వచ్చిన తర్వాత దాన్ని పునరుద్ధరించడం గమనార్హం.



## రేవంత్‌కు పాలనపై పట్టులేదు

### - ఎంపీ రఘునందన్‌రావు

**హైదరాబాద్:** రాష్ట్రంలో పాలన పడకేసిందని.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పాలనపై పట్టులేదని భాజపా ఎంపీ రఘునందన్‌రావు విమర్శించారు. ఆదివారం భాజపా రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో రఘునందన్‌రావు మాట్లాడారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో ప్రమాదం జరిగి 8 రోజులైనా సీఎంకు అక్కడికి వెళ్లే తీరిక లేదని, మున్సిపల్ శాఖ మంత్రిగా ఉంటూ ఆ శాఖలో ఏం జరుగుతుందో తెలుసుకోలేకపోతున్నారని.. సమస్యల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు నోటికి ఏది వస్తే అది మాట్లాడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్‌లో ఇంకా ఆరు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయని, వాటిని నింపేందుకు 14 నెలలుగా దాదాపు 30 సార్లు దిల్లీకి వెళ్లొచ్చినా సీఎంకు అనుమతి రావడం లేదని ఎద్దేవా చేశారు. ఇక బీసీ హక్కుల కోసం కొట్లాడితే ఒక ఎమ్మెల్సీనే బయటకు పంపే దుస్థితిలో కాంగ్రెస్ ఉందన్నారు. కిషన్‌రెడ్డిపై సీఎం అనేక ఆరోపణలు చేస్తున్నారని, ఆయన కేంద్ర మంత్రిగా ఉండి రాష్ట్రానికి నాలుగు ప్రాజెక్టులు, పైసలు తెచ్చారని రఘునందన్ తెలిపారు.

## ఆ 3 ప్రాజెక్టులకు నిధులు రాబట్టడంపై దృష్టి

### అధికారులతో మంత్రి ఉత్తమ్ సమీక్ష

**హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వం నుంచి మూడు ప్రాజెక్టులకు నిధులు రాబట్టేందుకు వీలుగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం సీఎం, ఉప ముఖ్యమంత్రితో కూడిన బృందం దిల్లీలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రిని కలవనున్న నేపథ్యంలో ఉత్తమ్ జలసౌధలో ఆదివారం సమీక్ష నిర్వహించారు. పీఎంకేఎస్‌వై నుంచి రాష్ట్రంలోని మోడికుంట వాగు, చనకా- కోర్టా, చిన్న కాళేశ్వరం ప్రాజెక్టులకు నిధులు, నాగార్జునసాగర్ నుంచి ఏపీ తరలిస్తున్న నీటి వాటాపై ఫిర్యాదు, కేడబ్ల్యూడీటీ-2 కేసును వేగంగా పరిష్కరించడంతోపాటు పాలమూరు, సీతారామ, సమ్మక్క సాగర్ ప్రాజెక్టులకు అనుమతులు సాధించడంపై మంత్రి అధికారులతో



సమీక్ష నిర్వహించారు. శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్సీలు అనిల్‌కుమార్, విజయ్ భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

### కరీంనగర్, నల్గొండలో ఉదయం 8 గంటల నుంచి..

**హైదరాబాద్:** మూడు ఎమ్మెల్సీ స్థానాలకు గత నెల 27న ఎన్నికలు జరగగా.. సోమవారం ఓట్ల లెక్కింపునకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ పట్టభద్రుల నియోజకవర్గంతో పాటు ఉపాధ్యాయ నియోజకవర్గానికి కరీంనగర్‌లోని అంబేడ్కర్ ఇండోర్ స్టేడియంలో, వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గానికి నల్గొండలోని వేర్‌హౌసింగ్ గోదాములో కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుంది.


**పట్టభద్రుల స్థానానికి మూడు రోజులు..**

కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ పట్టభద్రుల నియోజకవర్గంలో 2,50,106 మంది ఓటర్లు, ఉపాధ్యాయ నియోజకవర్గంలో 24,895 మంది, వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గంలో 24,139 మంది తమ ఓటు హక్కును ఉపయోగించుకున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపునకు మూడు రోజులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపునకు 36 గంటల చొప్పున సమయం పట్టే అవకాశాలు ఉన్నాయని ఎన్నికల అధికారులు అంచనా వేస్తున్నారు. ఉదయం 7 గంటలకు అభ్యర్థులు, వారి ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్‌రూమ్‌లను తెరుస్తారు. అనంతరం కౌంటింగ్ కేంద్రంలోని టేబుళ్ల వద్దకు తీసుకువస్తారు. కరీంనగర్ కౌంటింగ్ కేంద్రంలో 35 టేబుళ్లు ఏర్పాటు చేశారు. పట్టభద్రుల ఓట్ల కోసం 21 టేబుళ్లు, ఉపాధ్యాయ ఓట్ల కోసం 14 టేబుళ్లను వినియోగించుకోనున్నారు. ఇక్కడ 800 మంది సిబ్బంది పాల్గొననున్నారు. నల్గొండలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రం వద్ద 25 టేబుళ్లను ఏర్పాటు చేశారు. లెక్కింపు ప్రక్రియలో 350 మంది సిబ్బంది పాల్గొంటున్నారు.

## నవతరానికి ఆదర్శప్రాయుడు దుద్దిళ్ల శ్రీపాదరావు

### ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హైదరాబాద్:** ప్రజల నుంచి నాయకుడిగా ఎదిగిన వ్యక్తి, అజాతశత్రువు దుద్దిళ్ల శ్రీపాదరావు అని, ఆయన నవతరానికి ఆదర్శప్రాయుడని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం రాత్రి హైదరాబాద్ రవీంద్రభారతిలో రాష్ట్ర ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ శాసనసభాపతి దుద్దిళ్ల శ్రీపాదరావు 88వ జయంతి ఘనంగా నిర్వహించారు. భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. అప్పటి కరీంనగర్ జిల్లాలో ఎం.సత్యనారాయణ, చొక్కారావు, జి.వెంకటస్వామి, శ్రీపాదరావు వంటి వారు విలువల్ని కాపాడుకుంటూ.. కాంగ్రెస్ సిద్ధాంతాలను, గాంధేయవాదాన్ని ముందుకు తీసుకువెళ్లి మార్గదర్శకులుగా ఉన్నారన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఎమ్మెల్యేగా ఒకసారి గెలిస్తే రెండోసారి గెలవడమే కష్టమని, శ్రీపాదరావు మూడుసార్లు, ఆయన కుమారుడు శ్రీధర్‌బాబు ఐదుసార్లు ఎమ్మెల్యేలు అయ్యారంటే ఆ కుటుంబం నియోజకవర్గంలోని ప్రజలతో ఎంత మమేకం అయ్యిందో తెలుస్తోందన్నారు. శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ... శ్రీపాదరావు నేటికీ ప్రజల హృదయాల్లో నిలిచిపోయారంటే ఆయన మంచితనం, నడవడిక, చేసిన ప్రజా సేవేనని కొనియాడారు. మంత్రి శ్రీధర్‌బాబు స్పందిస్తూ.. పెద్దల అడుగుజాడల్లో నడవాలని ఎంత ప్రయత్నిస్తున్నా, పలు సందర్భాల్లో తప్పటడుగులు వేస్తున్నామా అనిపిస్తోందన్నారు. తాను ఏమైనా తప్పటడుగులు వేస్తున్నట్లు అనిపిస్తే చెప్పాలని, వీలైనంత వరకు సరిచేసుకునే ప్రయత్నం చేస్తానన్నారు. మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు.



వివిధ రంగాల్లో సేవలు అందించిన ఆర్.గోవిందహరి, బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్, సాహితీవేత్త బీఎస్ రాములు, కాట్రగడ్డ హిమాన్షి, సురభి వేణుగోపాల్, దివ్య, భాగ్యలకు పురస్కారాలు అందజేశారు. శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ డా.బండా ప్రకాశ్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీడబ్ల్యూసీ సభ్యుడు రుద్రరాజు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్సీ భానుప్రసాద్, ఎమ్మెల్యేలు ప్రేంసాగర్, పాల్వాయి హరీశ్, రాకేశ్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, రాజ్ ఠాకూర్, సత్యనారాయణ, కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం, మాజీ ఎంపీ అజీజ్‌పాషా, శ్రీపాదరావు సతీమణి జయమ్మ తదితరులు పాల్గొన్నారు.



## చిల్లర సమస్యలకు చెక్..

### గ్రేటర్ పరిధిలోని ఆర్టీసీ బస్సుల్లో డిజిటల్ చెల్లింపులు

**హైదరాబాద్:** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఆర్టీసీ బస్సుల్లో డిజిటల్ చెల్లింపులు అందుబాటులోకి వచ్చాయి. సిటీ ఆర్టీసీ బస్సుల్లో గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం వంటి ఆన్‌లైన్ సర్వీసులను ప్రారంభించారు. గతంలో చిల్లర సమస్యలతో ఇబ్బందులు తలెత్తేవని.. ఆన్‌లైన్ చెల్లింపులు అందుబాటులోకి రావడంతో చిల్లర సమస్యలకు పరిష్కారం లభించిందని కండక్టర్లు, ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే విమానాశ్రయానికి నడిపించే బస్సుల్లో ప్రయోగాత్మకంగా డిజిటల్ పేమెంట్ విధానాన్ని అమలు చేశారు. ఈ విధానం విజయవంతం కావడంతో ఇటీవలే టికెట్ జారీకి డిజిటల్ పేమెంట్ సేవలు అందుబాటులోకి తీసుకువస్తూ ఆర్టీసీ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. నగరంలో ఉన్న అన్ని రకాల సిటీ బస్సులలో కూడా ఐ-టిమ్స్ మిషన్లను అందుబాటులోకి తీసుకువచ్చారు.

## నాటకరంగ కళాకారులకూ పురస్కారాలు

### భక్త రామదాసు జయంతి ఉత్సవాల్లో ఉప ముఖ్యమంత్రి భట్టి

**నారాయణగూడ:** నాటకరంగ కళాకారులకూ పురస్కారాలు ఇవ్వనున్నట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. గత పదేళ్లలో సినిమా కళాకారులకు సరైన ప్రోత్సాహం అందలేదని, ఏటా వారికిచ్చే 'నంది' పురస్కారాలు కూడా ఇవ్వకుండా గత పాలకులు నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే కళాకారులను ప్రోత్సహించాలనే సంకల్పంతో ఏటా ఉగాది రోజున సినీ కళాకారులకు 'గద్దర్ తెలుగు సినిమా పురస్కారాలు' ఇవ్వాలని నిర్ణయం తీసుకుందన్నారు. ఆదివారం హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో తెలంగాణ సంగీత, నాటక అకాడమీ ఆధ్వర్యంలో 'శ్రీభక్త రామదాసు 392వ జయంత్యుత్సవాల'ను ఘనంగా నిర్వహించారు. మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి ఉప ముఖ్యమంత్రి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. సంగీత నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ డా.అలేఖ్య పుంజాల కోరిన మేరకు నాటకరంగ కళాకారులకు రాష్ట్రస్థాయి నాటక పోటీలు నిర్వహించి, అందులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి పురస్కారాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించారన్నారు. ఈ సందర్భంగా 'పద్మశ్రీ' పురస్కార గ్రహీతలు డా.యెల్లా వెంకటేశ్వరరావు, డా.శోభారాజులతోపాటు సంగీత విద్వాంసులు రాఘవాచార్యులు, హరిప్రియ, శేషలత, ప్రేమమూర్తి, కోవెల శాంత, డి.వి.మోహన్ కృష్ణలను ఘనంగా సత్కరించారు. సుమారు 600 మంది సంగీత కళాకారులతో సామూహిక 'శ్రీరామ సంకీర్తనం' గోష్ఠిగానం సాయంత్రం వరకు నిర్విరామంగా కొనసాగింది. కార్యక్రమంలో సంగీత నాటక అకాడమీ కార్యదర్శి మనోహర్ పాల్గొన్నారు.



## నా కుమార్తెకు పోకిరీల వేధింపులు

### - కేంద్ర మంత్రి ఖడ్సే

**ముంబాయి:** మహారాష్ట్రలో శాంతిభద్రతలపై కేంద్ర యువజన వ్యవహారాల శాఖ సహాయ మంత్రి రక్షా ఖడ్సే ఆందోళన వ్యక్తం చేశారు. జల్‌గావ్ జిల్లా ముక్తాయ్‌నగర్‌లో ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న తన కుమార్తెను కొందరు యువకులు వేధించారని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి తాజాగా పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. "మహాశివరాత్రి సందర్భంగా మా ప్రాంతంలో ఏటా సంత్ ముక్తాయ్ యాత్ర నిర్వహిస్తారు. ఇటీవల నిర్వహించిన స్నేహితులతో కలిసి ఆ యాత్రకు వెళ్తానని నా కుమార్తె కోరడంతో సెక్యూరిటీ సాయంతో అక్కడకు పంపించాను. ఆ సమయంలో కొందరు యువకులు వారిని వెంబడించి వేధించారు. అడ్డుకున్న భద్రతా సిబ్బందిపైనా దురుసుగా ప్రవర్తించారు. గుజరాత్ పర్యటన నుంచి నేను ఇంటికి రాగానే మా అమ్మాయి ఈ విషయం చెప్పింది. ఓ ఎంపీ లేదా కేంద్ర మంత్రి కుమార్తెకే ఇటువంటి దుస్థితి ఎదురైతే.. సాధారణ మహిళలు పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చు. ఈ ఘటనపై పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశా" అని కేంద్ర మంత్రి ఖడ్సే మీడియాకు వెల్లడించారు. ఇదే అంశంపై రక్షా ఖడ్సే మామ, మాజీ మంత్రి ఏక్‌నాథ్ ఖడ్సే మాట్లాడుతూ.. "ఈ యువకులపై గతంలోనూ పోలీసులకు ఫిర్యాదులు వచ్చాయి. ఈ అబ్బాయిలు కరుడుగట్టిన నేరస్థులు. మహారాష్ట్రలో మహిళలపై నేరాలు పెరుగుతున్నాయి. నేరస్థులు పోలీసులకు భయపడటం లేదు. బాధిత అమ్మాయిలు ఫిర్యాదు చేయడానికి ముందుకు రావడం లేదు. వారి తల్లిదండ్రులు కూడా తమ కుమార్తెల పేర్లు బయటకు రావద్దని భావిస్తున్నారు. మాకు ప్రత్యామ్నాయం లేకనే ఫిర్యాదు చేశాం" అన్నారు. "పోలీస్ స్టేషన్‌కు వెళితే రెండు గంటలు మమ్మల్ని కూర్చోబెట్టారు. అమ్మాయిల విషయం కావడంతో పునరాలోచించు కోవాలని పోలీసులు మాకు చెప్పారు. యువకులు పోలీసులపైనా దాడి చేసిన సందర్భాలున్నాయి. వాళ్లు ఎంతగా తెగిస్తారో వీటిని బట్టి ఊహించుకోవచ్చు. వీళ్లకు రాజకీయ నాయకుల అండ ఉంది. ఇదే విషయంలో డీఎస్పీ, ఐజీతోనూ మాట్లాడాను" అని ఖడ్సే ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ స్పందించారు. నిందుతులు ఓ రాజకీయ పార్టీకి చెందినవాళ్లని, అందులో కొందర్ని పోలీసులు అరెస్టు చేశారని చెప్పారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తాజా పరిణామంపై కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు హర్షవర్ధన్ సప్కాల్ మాట్లాడుతూ.. మహాయుతి ప్రభుత్వంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని మండిపడ్డారు.



## నేడు రెండు రైళ్లు పాక్షికంగా రద్దు

**హైదరాబాద్:** రెండు రైళ్లను సోమవారం పాక్షికంగా రద్దు చేస్తున్నట్లు ద.మ.రైల్వే తెలిపింది. వికారాబాద్ స్టేషన్‌లో సాంకేతిక పనుల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఈమేరకు వికారాబాద్-కాచిగూడ ప్యాసింజర్‌ను వికారాబాద్-శంకర్‌పల్లి స్టేషన్ల మధ్య రద్దు చేశారు. గుంటూరు-వికారాబాద్ పల్నాడు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ చిట్‌గిద్ద-వికారాబాద్ స్టేషన్‌ల మధ్య తిరగదు. రేపల్లె-వికారాబాద్‌ల మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ ఆదివారం శంకర్‌పల్లి వరకే వచ్చింది.



## పౌల్ట్రీ సమస్యలను పరిష్కరించాలి

**హైదరాబాద్:** పౌల్ట్రీరంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా చేయూతనిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. పౌల్ట్రీ ఉత్పత్తుల ప్రాధాన్యంపై అవగాహన పెంచేందుకు ఆ రంగానికి చెందిన సంఘాలు కృషి చేయాలని సూచించారు. మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి నేతృత్వంలో ఆదివారం తెలంగాణ పౌల్ట్రీ సమాఖ్య (టీపీఎఫ్) నాయకులు మోహన్‌రెడ్డి, వి.భాస్కర్‌రావు, నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ(ఎన్ఈసీసీ) ప్రతినిధి జి.చంద్రశేఖర్‌రెడ్డి, తెలంగాణ పౌల్ట్రీబ్రీడర్స్ అసోసియేషన్ నేతలు జి.రమేశ్‌బాబు, డి.రామ్‌రెడ్డి, కేజీ ఆనంద్, పౌల్ట్రీ ఇండియా అధ్యక్షుడు ఉదయ్‌సింగ్ బయాస్‌తో పాటు ఇతర నేతలు సీఎంను ఆయన నివాసంలో కలిశారు. పౌల్ట్రీరంగం ఎదుర్కొంటున్న సమస్యలను, ఇటీవలి పరిణామాలను ఆయనకు వివరించారు. త్వరలో పౌల్ట్రీ ప్రతినిధులతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తామని సీఎం పేర్కొన్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
3 మార్చి
2025









# న్యూజిలాండ్‌పై టీం ఇండియా గెలుపు

- వరుణ్ చక్రవర్తికి 5 వికెట్లు
- అర్ధ సెంచరీతో రాణించిన శ్రేయస్ అయ్యర్
- ఆసీస్‌తో భారత్ సెమీస్ మ్యాచ్

**దుబాయ్:** ఛాంపియన్స్ ట్రోఫీలో లీగ్ దశను టీమ్ఇండియా ఓటమి లేకుండా ముగించింది. ఇప్పటికే సెమీస్ చేరిన భారత జట్టు.. ఆదివారం న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 44 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ గెలుపుతో గ్రూప్ -ఎలో అగ్రస్థానంలో నిలిచిన టీమ్ఇండియా.. మంగళవారం (మార్చి 4) జరిగే తొలి సెమీ ఫైనల్‌లో ఆస్ట్రేలియాతో తలపడ నుంది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 249 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో భారత స్పిన్నర్ల ధాటికి న్యూజిలాండ్ 45.3 ఓవర్లలో 205 పరుగులకే కుప్పకూలింది. కేన్ విలియమ్సన్ (81, 120 బంతుల్లో 7 ఫోర్లు) ఒక్కడే పోరాడాడు. మిచెల్ శాంట్నర్ (28), విల్ యంగ్ (22), డారిల్ మిచెల్ (17), టామ్ లేథమ్ (14), గ్లెన్ ఫిలిప్స్ (12) పరుగులు చేశారు. మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి తన రెండో వన్డేలోనే ఐదు వికెట్ల ప్రదర్శనతో (5/42) అదరగొట్టాడు. కుల్‌దీప్ యాదవ్ 2, హార్దిక్ పాండ్య, అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా ఒక్కో వికెట్ పడగొట్టారు. భారత బ్యాటర్లలో శ్రేయస్ అయ్యర్ (79, 98 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. అక్షర్ పటేల్ (42, 61 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. చివర్లో హార్దిక్ పాండ్య (45, 45 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడాడు. కేఎల్ రాహుల్ (23), రవీంద్ర జడేజా (16) పరుగులు చేశారు. రోహిత్ శర్మ (15), శుభ్‌మన్ గిల్ (2), విరాట్ కోహ్లీ (11) నిరాశపర్చడంతో భారత్ 30 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో శ్రేయస్, అక్షర్ పటేల్ టీమ్ఇండియా ను ఆదుకున్నారు. ఈ జోడీ నాలుగో వికెట్‌కు 98 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. చివర్లో హార్దిక్ మెరుపులు మెరిపించడంతో భారత్ పోరాడే స్కోరు సాధించింది. న్యూజిలాండ్ బౌలర్లలో మ్యాట్ హెన్రీ 5, జేమీసన్, విలియం ఓరూర్క్, శాంట్నర్, రచిన్ రవీంద్ర ఒక్కో వికెట్ తీశారు.




### వరుణ్ చక్రవర్తికి 5 వికెట్లు

ఆదివారం న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 44 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ఐదు వికెట్లు తీసి టీమ్ఇండియా గెలుపులో కీలక పాత్ర పోషించాడు. వన్డేల్లో ఒకే మ్యాచ్‌లో 5 వికెట్లు తీయడం వరుణ్ చక్రవర్తికి ఇదే తొలిసారి. కాగా 45వ ఓవర్‌లో కేవలం మూడు బంతుల వ్యవధిలో షాంట్నర్ (28), మ్యాట్ హెన్రీ(2)లను ఔట్ చేయడం విశేషం.

# కోహ్లీ పోరాట స్ఫూర్తే అతడిని దిగ్గజం చేసింది

## వివ్ రిచర్డ్స్


ఓటమిని అంగీకరించకుండా తుదివరకు విజయం కోసం పోరాడే స్ఫూర్తే కోహ్లీని దిగ్గజం చేసిందని వెస్టిండీస్ మాజీ సూపర్‌స్టార్ వివ్ రిచర్డ్స్ పేర్కొన్నాడు. తాజాగా 300వ వన్డే మ్యాచ్ ఆడుతున్న సందర్భంగా విరాట్‌ను పొగడ్తలతో ముంచెత్తాడు. ఇంటర్నేషనల్ మాస్టర్స్ లీగ్ సందర్భంగా ఆయన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. "అతడు మా అందరికీ సమాధానం ఇస్తాడని అనుకొన్నాం. కచ్చితంగా దానిపై అతడు శ్రమిస్తాడని భావించాము. కానీ, ఆ మ్యాచ్‌లో అంతగా రాణించలేదు. ఆ తర్వాత మ్యాచ్‌లో మాత్రం అద్భుతమైన శతకంతో ఫామ్‌ను అందుకొన్నాడు. నేను చెప్పేది అలాంటి పోరాటపటిమే అతడిని లెజండరీ స్థాయిలో ఉంచుతుంది. ఆటగాళ్లు కెరీర్‌లో కిందకు పడిన ప్రతిసారీ తిరిగి కోలుకోవడం సాధ్యం కాదు. కానీ, వారిలో ఉండే పోరాట స్ఫూర్తి, శక్తి, బాగా ఆడాలనే తపన వంటివి వారిని ఉన్నత స్థానాలకు చేరుస్తాయి. అతడు (విరాట్) కెరీర్‌లో క్లిష్ట సమయాలను ఎదుర్కోగలడు.. అలా ఎదుర్కొనే.. మళ్లీ పుంజుకొన్నాడు" అని రిచర్డ్స్ పేర్కొన్నాడు. విరాట్ ఇటీవలే ఛాంపియన్స్ ట్రోఫీలో పాక్‌తో జరిగిన లీగ్ మ్యాచ్‌లో శతకంతో జట్టును విజయతీరాలకు చేర్చాడు.

### కోహ్లీ విపరీతంగా శ్రమిస్తాడు: గ్లెన్ ఫిలిప్స్

తాజాగా మ్యాచ్ న్యూజిలాండ్ ఆటగాడు గ్లెన్ ఫిలిప్స్ కూడా కోహ్లీని ఆటతీరును కొనియాడాడు. గతంలో తాను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు ఆడిన సమయంలో విరాట్‌తో డ్రెస్సింగ్ రూమ్‌ను పంచుకొన్న విషయాన్ని గుర్తు చేసుకొన్నాడు. "కచ్చితంగా విరాట్ అద్భుతమైన ఆటగాడు. అతడితో నాకు కొంచెం వ్యక్తిగత పరిచయం కూడా ఉంది. చాలా కష్టపడతాడు. అతడు ఆటకు, ఇండియన్ క్రికెట్‌కు, యువ ఆటగాళ్లకు చేసింది అద్భుతం" అని పేర్కొన్నాడు. విరాట్ తాజాగా న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌తో కలిపి కెరీర్‌లో 300 వన్డేలు ఆడినట్లయింది. కోహ్లీ కెరీర్‌లో 200వ వన్డే కూడా కివీస్‌తోనే ఆడటం గమనార్హం. ప్రపంచంలో 300 వన్డేలు ఆడిన 18వ ఆటగాడిగా.. భారత్ తరఫున 7వ ప్లేయర్‌గా నిలిచాడు. ఇక 100 టెస్ట్‌లు, 100 టీ20లు, 300 వన్డేలు ఆడిన ఏకైక ఆటగాడు కూడా కోహ్లీనే. న్యూజిలాండ్‌తో మ్యాచ్‌కు ముందు కోహ్లీని జట్టు సభ్యులు అభినందించారు. ఈ మ్యాచ్‌లో 11 పరుగులు చేశాడు. హెన్రీ బౌలింగ్‌లో ఫిలిప్స్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్‌కు చేరుకొన్నాడ







## ఎద అందాలతో రచ్చ చేస్తోన్న మిల్క్ బ్యూటీ..

టాలీవుడ్ ముద్దుగుమ్మ తమన్నా భాటియా గురించి స్పెషల్‌గా చెప్పాల్సిన అక్కర్లేదు. ఈ బ్యూటీ ఎందరో అగ్ర హీరోలతో జతకట్టి..అతితక్కువ సమయంలోనే స్టార్ డమ్ సంపాదించుకుంది. భాషతో సంబంధం లేకుండా సినిమాల్లో, వెబ్ సిరీస్‌ల్లో నటిస్తూ ప్రేక్షకుల్ని అలరిస్తుంది మిల్క్ బ్యూటీ. హ్యాపీడేస్, ఎందుకంటే ప్రేమంట, ఊసరవెల్లి, 100% లవ్, బద్రీనాథ్ రెబెల్, కెమెరామెన్ గంగతో రాంబాబు.. బాహుబలి, తడాఖా, బెంగాల్ టైగర్, సైరా నరసింహారెడ్డి, భోలా శంకర్, జైలర్, స్త్రీ-2 వంటి అనేక చిత్రాల్లో తన సత్తా చాటింది. అద్భుతమైన నటన, అందం, అభినయం.. ముఖ్యంగా ఇరగదీసే డ్యాన్స్‌తో తెలుగు ప్రేక్షకుల మెప్పు పొందింది. అంతేకాకుండా తమన్నా భాటియా ఐటెమ్ సాంగ్స్‌లో కూడా మెరిసింది. ఇక సినీ ఇండస్ట్రీకి వచ్చి ఇన్నేళ్లు అవుతున్నా.. చెక్కు చెదరని అందంతో ఈ మిల్క్ బ్యూటీ కుర్రాళ్ల మతిపోగుడుతుందనడంలో అతిశయోక్తిలేదు. ఇక తమన్నా బాలీవుడ్ నటుడు విజయ్ వర్మతో చాలా కాలంగా రిలేషన్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. త్వరలోనే పెళ్లి కూడా చేసుకోబోతున్నారంటూ సోషల్ మీడియాలో తరచూ అనేక వార్తలు వస్తుంటాయి. ఈ వార్తలన్నీ ఎంతవరకు వాస్తవమో తెలియదు. ఇదంతా పక్కన పెడితే ఈ మిల్క్ బ్యూటీ తాజాగా సోషల్ మీడియా వేదికన ఓ పోస్ట్ పెట్టింది. వైట్ డ్రెస్‌లో బంగారంలా మెరిపోతున్న ఫొటోలు నెట్టింట పంచుకుంది. ఈ ఫ్రాక్‌లో తమన్నా క్యూట్‌గా కనిపిస్తూనే మరో వైపు హాట్ హాట్ అందాలను ప్రదర్శించింది. కనిపించి కనిపించని ఎద అందాలతో కుర్రాళ్లకు కిక్కెక్కిస్తోంది. ప్రస్తుతం ఈ పిక్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.



## ఆ వీడియోలతో నాకు సంబంధం లేదు : విద్యా బాలన్

సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతోన్న తన వీడియోలను ఉద్దేశించి బాలీవుడ్ నటి విద్యా బాలన్ తాజాగా ప్రత్యేక సందేశం రిలీజ్ చేశారు. ఆ వీడియోలతో తనకు ఏమాత్రం సంబంధం లేదని, అవన్నీ ఏఐ టెక్నాలజీతో క్రియేట్ చేసిన డీప్ ఫేక్‌వని చెప్పారు. నెటిజన్లు అప్రమత్తంగా ఉండాలని కోరారు. “సోషల్‌మీడియా, వాట్సాప్ గ్రూపుల్లో ఈ మధ్యకాలంలో నాకు సంబంధించిన పలు వీడియోలు చక్కర్లు కొడుతున్నాయి. అయితే, అవన్నీ ఏఐ జనరేటెడ్‌వి. వాటితో నాకు ఎలాంటి సంబంధం లేదు. ఆ వీడియోలను సృష్టించడం లేదా వ్యాప్తి చేయడంలో నా ప్రమేయం లేదు. అందులోని కంటెంట్‌ను కూడా నేను ఏమాత్రం అంగీకరించను. కాబట్టి, సోషల్‌మీడియాలో వీడియోలు షేర్ చేసేముందు దయచేసి వాటి గురించి పూర్తి సమాచారం తెలుసుకోండి. ఏఐ జనరేటెడ్ కంటెంట్ మిమ్మల్ని తప్పుదోవ పట్టించే ప్రమాదం ఉంది. అప్రమత్తంగా ఉండండి” అని విద్యా బాలన్ పేర్కొన్నారు. డీప్ ఫేక్ టెక్నాలజీ వల్ల ఇప్పటికే ఎంతోమంది నటీమణులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రష్మిక, దీపికా పదుకొణె, కత్రినా కైఫ్, అలియా భట్ వంటి తారలు ఈ టెక్నాలజీ బాధితులే. సినిమాల విషయానికి వస్తే.. విద్యాబాలన్ కీలక పాత్ర పోషించిన ‘భూల్ భూలయ్యా 3’ గతేడాది విడుదలై విజయాన్ని అందుకుంది. కార్తిక్ ఆర్యన్ హీరోగా నటించిన ఈ సినిమాలో ఆమె మల్లిక పాత్రలో కనిపించి ప్రేక్షకులను అలరించారు.

## మెఘా ఆకాష్.. అసలైన సన్‌షైన్ గర్ల్

మెఘా ఆకాష్ గ్లామర్‌కు ఎప్పుడూ ఓ ప్రత్యేకమైన స్టైల్ ఉంటుంది. క్యూట్ లుక్స్, మధురమైన నవ్వుతో అభిమానుల హృదయాలను దోచుకునే ఈ ముద్దుగుమ్మ తాజాగా తన కొత్త ఫొటోషూట్‌తో మరోసారి ఫ్యాన్స్‌ను మంత్రముగ్ధులను చేసింది. ‘సన్ షైన్ గర్ల్’ అంటూ క్యాప్షన్ పెట్టిన మెఘా ఆకాష్, బీచ్ వైబ్స్‌లో దిగిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

ఈ ఫోటోలలో మెఘా ఆకాష్ వైట్ అండ్ గ్రీన్ కలర్ మిక్స్ అయిన ఆఫ్ షోల్డర్ టాప్ ధరించి, స్టైలిష్ యాక్సెసరీస్‌తో అదిరిపోయేలా మెరిసిపోయింది. సన్‌గ్లేర్స్ లేకుండా నేచురల్ లైట్‌లో తన మెరుపును చూపిస్తూ, ఆమె పింక్ ఇయర్‌రింగ్స్ తో మరింత స్టైలిష్‌గా కనిపించింది. స్వచ్ఛమైన ముద్దు నవ్వుతో మెఘా పోజులిచ్చిన తీరు అభిమానులను అమితంగా ఆకట్టుకుంటోంది. ఇటీవలే తన వ్యక్తిగత జీవితంలో ఓ కొత్త దశకు వెళ్లిన మెఘా ఆకాష్, పెళ్లి అనంతరం శ్రీలంక ట్రిప్‌ను ఎంజాయ్ చేస్తోంది. అక్కడ లాకేశన్స్, బీచ్ వైబ్స్‌ను తన ఫోటోషూట్‌లో మిళితం చేసి అందరికీ ఓ ఫ్రెష్ ఫీలింగ్ తెచ్చింది. మెరిసే చర్మం, నేచురల్ లుక్‌తో మెఘా ఆకాష్ అసలైన ‘సన్‌షైన్ గర్ల్’ అని అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. సినిమాల విషయానికి వస్తే, మెఘా ఆకాష్ తెలుగు ప్రేక్షకులకు ‘లై’, ‘చల్ మోహన్ రంగ’ సినిమాలతో బాగా దగ్గరైంది.

Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986